RNI Reg-No.APTEL/2005/19204 ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక


Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 159 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 9-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు,జ్యేష్ఠ మాసం, తిథి॥ నవమి రా॥9.02, ఉ.భా. తె॥4.44, వర్జ్యం మ॥2.28 -4.03, దుర్ముహూర్తం ఉ॥ 8.03-8.55, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.28, సూర్యాస్తమయం సా॥ 6.27 గం॥

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

### 8 మంది కార్మికులు మృతి



**విశాఖపట్నం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో భారీ మొత్తంలో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఉక్కు ద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అగ్నిపమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు.

## 10న ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సిఎం, డిప్యూటి సిఎంల భేటీ

### నేడు ఢిల్లీకి వెళ్లనున్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్





**అమరావతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జూన్ 10వ తేదీన నిర్వహించనున్న ఎన్డీఏ ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రుల సమావేశంలో వీరు పాల్గొన నున్నారు. మోదీ ప్రభుత్వం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఎన్డీఏ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఉప ముఖ్యమంత్రులు హాజరుకానుండగా, కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాలతో సమన్వయం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. దేవిధంగా, త్వరలో జరగబోయే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం కూడా ఈ సమావేశంలో ప్రస్తావనకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాత్ర, భవిష్యత్తు రాజకీయ వ్యూహాలు, రాష్ట్రాల అభివృద్ధి ప్రణాళికలపై కూడా చర్చలు జరగవచ్చని సమాచారం. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన కీలక అంశాలు, రాష్ట్ర అభివృద్ధి ప్రాజెక్టులు, కేంద్ర సహాయ నిధులు, పెండింగ్‌లో ఉన్న విభజన హామీలపై సీఎం చంద్రబాబు కేంద్ర నాయకత్వంతో చర్చించే అవకాశం ఉంది.




- భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీ
- క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ
- ట్యాంపర్ చేయకుండా పకడ్బందీగా భూ రికార్డులు
- గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారు
- గొడ్డలి పట్టే వారికి నాగలి పట్టే వారి బాధలు ఎలా తెలుస్తాయి
- ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరిస్తున్నాం
- సిద్ధాంతంలో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ
- సాగు,తాగునీటికి ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్న సీఎం చంద్రబాబు

## ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే

**భీమవరం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్‌చైన్ టెక్నాలజీని తీసుకొచ్చామని సీఎం తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని అన్నారు. సోమవారం సిద్ధాంతంలో రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలను సీఎం పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తాగు నీరు, సాగునీరుకి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకునే బాధ్యతను మంత్రి రామానాయుడికి అప్పగించామన్నారు. ఎప్పుడు చూసినా గోదావరి జిల్లా ఆహ్లాదకరంగా ఉంటుందన్నారు. పంటలు పండించడంలో జిల్లాలో రైతులకు మించిన వారు లేరని కొనియాడారు. రాయలసీమ, విశాఖ జిల్లాల్లో పరిశ్రమల కోసం భూములు కావాలంటే ఇస్తారని.. ఇక్కడ మాత్రం సెంటు భూమి కూడా ఇవ్వరని అన్నారు. అక్వా రైతుల సంక్షేమం కోసం ఓ ప్రణాళిక రూపొందించనున్నట్లు మిగతా 2లో..

## మోదీ పాలనతో చిక్కుల్లో దేశం

### సర్ ప్రక్రియతో లక్షలాది మంది ఓట్లు గల్లంతు... రాజకీయ వేధింపులకు దర్యాప్తు సంస్థల దుర్వినియోగం

### ఇండియా కూటమి భేటీలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే

**న్యూఢిల్లీ, జూన్ 8 (ఆర్ఎన్ఎ):** ప్రధాని నరేంద్ర మోదీ పాలనతో భారతదేశం సమస్యల్లో పడిందని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అన్నారు. మోదీ హయాంలో రాజ్యాంగంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని.. బీజేపీయేతర రాష్ట్రాలపై కేంద్రం వివక్ష చూపుతోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ వేధింపులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఇండియా బ్లాక్ కూటమి పార్టీల నేతలు సమావేశమయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం ఎదుర్కొంటున్న





రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా కూటమి పార్టీలను ఉద్దేశించి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రసంగించారు. దేశ ఆర్థిక పరిస్థితి అత్యంత ఆందోళన కరంగా ఉందని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పనకు అవసరమైన పెట్టుబడులు దేశానికి రావడం లేదని పేర్కొన్నారు. పలు మిగతా 2లో..

## హోర్ముజ్ జలసంధి మూసివేత

### - సంక్షోభంకొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం - దేశంలో 30 నుంచి 60 రోజులకు సరిపడా ఇంధన నిల్వలు

### - కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ

**న్యూఢిల్లీ, జూన్ 8 (ఆర్ఎన్ఎ):** హోర్ముజ్ జలసంధి మూసి ఉంచినప్పటికీ దేశంలో ఇంధన నిల్వలకు ఢోకా లేదని కేంద్ర పెట్రోలియం, సహజవాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. 30 నుంచి 60 రోజుల వరకూ సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్రమంత్రి తెలిపారు. అయితే పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం సుదీర్ఘకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు. సోమవారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ... 'మరో 30 రోజులు హోర్ముజ్ జలసంధి మూతపడే ఉంటే ఏం జరుగుతుంది? దేశీయంగా మనకు తగినన్ని



నిల్వలు ఉన్నాయి. 60-60-60 అని చెప్పగలను. అంటే 60 రోజులకు సరిపడా క్రూడాయిల్, నేచురల్ గ్యాస్, ఎల్పీజీ నిల్వలు ఉన్నాయి' అని హర్దీప్ సింగ్ పురీ చెప్పారు. స్వల్పకాలిక అంతరాయాలను భాగస్వామ్య దేశాల సపోర్ట్‌తో అధిగమించేందుకు అవసరమైన వ్యూహాత్మక ప్రణాళికలు తమ వద్ద ఉన్నాయని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితి రెండు మూడు రకాలుగా ఉండొచ్చని, ఘర్షణలు విస్తరిస్తే అది అసాధారణ పరిస్థితి అవుతుందని, అది బాధాకరమని అన్నారు. ఒకవేళ హోర్ముజ్ జలసంధిని మూసి ఉంచిన పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఇప్పటికే చర్యలు ప్రారంభించామని చెప్పారు. యూఏఈ వంటి మంచి మిత్రులు ని, ఎల్పీజీ కార్గోలను నేరుగా మనకు పంపగలమని యూఏఈ నుంచి ప్రతిపాదన ఉందని, పరిస్థితులను సమర్థవం తంగా ఎదుర్కోగలమని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతానికి దేశీయంగా స్ట్రాటజిక్ పెట్రోలియం సహా 30 నుంచి 60 రోజులకు సరిపడా అన్నిరకాల నిల్వలు ఉన్నాయని చెప్పారు. ఇవి 76 నుంచి 80 రోజులకు కూడా సరిపోవచ్చన్నారు.

## సమాజానికి వైసిపి తీవ్ర హానికరం

- ఈ విషయాన్ని కూటమి నేతలు రోజూ చెప్పాల్సిందే
- నంద్యాల పర్యటనలో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



**నంద్యాల, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సిగరెట్ తాగడం ఎంత హానికరమో.. సమాజానికి వైసీపీ అంతకంటే హానికరమని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ హెచ్చరించారు. ఈ మిగతా 2లో..

## టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

### రాజ్యసభ ఎంపి సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా





**కోల్‌కతా, జూన్ 8 (ఆర్ఎన్ఎ):** టీఎంసీ కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీఎంసీతో తన బంధాన్ని తెంచుకుంటున్నట్లు వెల్లడించారు. పార్టీ అసెంబ్లీ సభ్యుల్లో తిరుగుబాటు పార్లమెంట్ వైపు కూడా పాకొచ్చని ఇటీవలే ఆయన పార్టీ తీరుపై అసంతృప్తి వ్యక్తంచేశారు. టీఎంసీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన పార్టీ నుంచి వైదొలగడం మిగతా 2లో..

## నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి తిరుపతి రాక!

### - జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం జూన్ 9వ తేది మంగళవారం తిరుపతికి విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సోమ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్య మంత్రి మంగళవారం ఉ.10.40 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని, అనంతరం తిరుపతి రూరల్ మండల పరిధిలో గల దామినేడు గ్రామం వద్ద ఉన్న మహీంద్రా షో రూమ్ సమీపంలో ఏర్పాటు చేసిన ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 2 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హెలికాప్టర్ లో ఉండవల్లి చేరుకుంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

**సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు:జిల్లా కలెక్టర్**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పగడ్బందీగా చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. స్థానిక దామినేడు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో .సోమవారం జిల్లా కలెక్టర్ డా ఎస్



వెంకటేశ్వర్ జిల్లా ఎస్ పి ఎల్ .సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, చంద్రగిరి, తిరుపతి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరని శ్రీనివాసులు, టిటిడి బోర్డు మెంబర్ పనబాక లక్ష్మి, తిరుపతి ఎం ఎల్ ఏ ఆరని శ్రీనివాసులు, శాప్ చైర్మన్ రవి నాయుడులతో కలిసి పరిశీలించారు. విధులు కేటాయించిన అధికారులు బాధ్యతగా నిర్వహించాలని, ఎలాంటి లోటు పాట్లు లేకుండా భద్రత ఏర్పాట్లు ఉండాలని తెలిపారు.పర్యటన సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అత్యవసర సదుపాయాలు, భద్రతా చర్యలు మరియు ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ , ప్రజాప్రతినిధులు, పోలీసు, రెవెన్యూ మరియు ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి రాక**


రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి జిల్లాలో ఒక రోజు పర్యటన నిమిత్తం జూన్ 09 న తిరుపతికి విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మంగళవారం ఉ.10.30 గం.లకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారన్నారు. అనంతరం ఉ.10.50 గం.లకు తిరుపతి రూరల్ మండల పరిధిలో గల దామినేడు సమీపంలో ఏర్పాటు చేసిన రీజినల్ స్థాయి ఎన్ డి ఏ బహిరంగ సభలో పాల్గొని, కార్యక్రమం ముగించుకుని మధ్యాహ్నం 01.45 గం.లకు తాజ్ హోటల్ చేరుకుని విశ్రాంతి తీసుకుంటారన్నారు. అనంతరం మ.3.00 గం.లకు తాజ్ హోటల్ నుండి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని మ.3.30 గం. లకు ఢిల్లీ బయల్దేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## పరీక్షలంటే తెలియని వారు విమర్శలా

### విద్యార్థులకు జగన్ క్షమాపణలు చెప్పాలి... ఇక్కడ చాలదన్నట్లు తెలంగాణలోనూ భూ కబ్జాలు

### జగన్ తీరుపై మండిపడ్డ సిఎం చంద్రబాబు

**భీమవరం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నా దగ్గర తోక జాడిస్తే చూస్తూ ఊరుకోను. నేను సీఎంగా ఉన్నంతవరకు ఎవరు తప్పు చేసినా వదిలిపెట్టనని సిఎం చంద్రబాబు హెచ్చరించారు. సిద్ధాంతంలో పట్టాదారు పుస్తకాల జారీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొడ్డలి పార్టీవి అన్నీ తప్పుడు



ప్రచారాలే. నిరుద్యోగులను మోసం చేసిన చరిత్ర వైసీపీది. నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాకే జగన్ రాజకీయాలు చేసుకోవాలని హెచ్చరించారు. వివేకాను చంపి.. నా చేతిలో గొడ్డలి పెట్టారు. జగన్ వంటివారికి ఎప్పటికప్పుడు బుద్ధి చెప్పాలి. పరీక్షలు అంటే మిగతా 2లో..

మానవుడు ఎంత గొప్పవాడైతే, అంత కఠినమైన పరీక్షలను ఎదుర్కొనవలసి ఉంటుంది. నాగరికత అంటే పట్టణాలలో గుమిగూడి మూర్ఖపు జీవితం గడపడం కాదు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై నిఘా !

ఇటీవలి కాలంలో మాదక ద్రవ్యాల పట్టివేత ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడికక్కడ నిత్యం ఎక్కో ఓ చోట మాదక ద్రవ్యాలు పట్టుబడుతూనే ఉన్నాయి. ఉమమడి తెలుగు రాష్ట్రాల్లో గంజాయి విపరీతంగా సరఫరా అవుతోంది. ఈగల్ టీమ్‌లు పనిచేస్తున్నా, డ్రగ్స్ సరఫరా ఆగడం లేదు. చాపకింద నీరులా డ్రగ్స్ రవాణా సాగుతుతోంది. కాలేజీలు, స్కూళ్లు తెరుస్తున్న వేళ ప్రభుత్వాలు అప్రమత్తం కావాలి. మాదక ద్రవ్యాలు చిన్నారులను చిదిమేయకుండా చూడాలి. తల్లిదండ్రులు కూడా పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి. ఎవరు ఎవరితో వెళు తున్నారు..ఎక్కడికి అన్నది గుర్తించాలి. మాదక ద్రవ్యాల ముఠాలు విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని వ్యాపారాలు చేస్తున్నాయి. కఠినంగా వ్యవహరించకపోతే యువత తీవ్ర ప్రమాదంలో పడేలా ఉంది. పిల్లల ప్రవర్తనను, వారు ఎక్కడెక్కడి వెళుతున్నారన్నది తల్లిదండ్రుల నిరంతరం గమనించాలి. వారరు ఎవరి వలలో అయినా పడుతున్నారా అన్నది గుర్తించాలి. విద్యా సంస్థల్లో అవసరమైతే చెకింగ్స్ పెట్టాలి. ఈ రకంగా పిల్లలపై దుష్ప్రభావం చూపకుండా చేయాలి. మాదక ద్రవ్యాల ముఠాలు ఇప్పటికే ఐటి రంగాన్ని, సినిమా రంగాన్ని కేడా ప్రభావితం చేస్తున్నాయి. డ్రగ్స్ పార్టీలు కలకలం రేపుతున్నాయి. ఫామ్‌హౌజ్ పార్టీల్లో డ్రగ్స్ వాడకం పెరిగింది. ఇటీవల పలు కేసుల్లో ఇది నిరూపితం అయ్యింది. ఇతర దేశాలతో పోల్చితే భారతదేశంలో మాదకద్రవ్యాల వినియోగం తక్కువగా ఉంది. అయితే ప్రపంచ వ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాలో భారత్ క్రమేణా కీలక పాత్ర వహిస్తోంది. సహజంగానే ఇది ఆందోళన కలిగించే అంశం. విశ్వవ్యాప్తంగా ఉత్పత్తి అవుతోన్న హెరాయిన్‌లో 95శాతం థాయిలాండ్, బర్మా, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ లలోనే ఉత్పత్తి అవుతోంది. ఈ దేశాల మధ్య ఉన్న భారత్‌కు మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడం కత్తి మీద సాముగా ఉంది. మాదక ద్రవ్యాల అక్రమరవాణాకు భౌగోళికంగా భారత్ అనువుగా ఉంది. దీంతో అంతర్జాతీయ ముఠాలు భారత్‌పై కన్నేసి ఉంచాయి. భారత్ నుంచి విదేశాలకు నిత్యం రాకపోకలు సాగించే ప్రవాసులను పావులుగా వాడుకోవడానికి ఆ మాఫియా ముఠాలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నాయి. మాదక ద్రవ్యాలన్నింటిలోనూ ఖరీదైన హెరాయిన్‌ను భారతదేశంలో ప్రతి రోజూ సగటున 28 లక్షల మంది ఒక టన్ను మేరకు వినియోగిస్తున్నట్లు ఒక సర్వేలో వెల్లడయింది. కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ఈ విషయాన్ని తెలిపింది. దీన్ని బట్టి మాదక ద్రవ్యాల వినియోగం ఎంతగా పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ఒక్క హెరాయిన్ ద్వారా భారత్‌లోకి ప్రతి సంవత్సరం 1.44 లక్షల కోట్ల రూపాయల సొమ్ము మనీలాండరింగ్ ద్వారా వస్తుందని కూడా కేంద్రప్రభుత్వ అధ్వర్యంలోని జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ అంచనా వేసింది. ఆరంభంలోనే ఈ అక్రమాన్ని నిర్మూలించడానికి సమగ్ర చర్యలు తీసుకోకపోతే తెలుగు రాష్ట్రాల, పంజాబ్‌కు తేడా లేకుండాపోతుంది. మరీ ముఖ్యంగా స్కూళ్లు, కాలేజీలు లక్ష్యంగా ముఠాలు పనిచేస్తున్నట్లు ఇటీవల గుర్తించారు. పిల్లు మాదక ద్రవ్యాలకు బానిసలైతే వారిని దారిలోకి తీసుకుని రావడం కష్టం. అందువల్ల ఈ ముఠాల మూలాలను కనుగొని వాటిని నిర్మూలించాల్సి ఉంది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రవాసులతో పాటుగా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రవాసుల ద్వారా వారికే తెలియకుండా మాదక ద్రవ్యాలను విదేశాలకు సరఫరా చేస్తున్నట్లుగా ఇప్పటి వరకు బహిర్గతమైన కేసుల ద్వారా తెలుస్తోంది. గల్ఫ్ దేశాల్లో మాదక ద్రవ్యాల రవాణా, సేవనం పై కఠిన ఆంక్షలు ఉన్నాయి. అక్కడ చాలామంది కఠిన శిక్షలకు గురవుతున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నేరం పై గల్ఫ్ దేశాలలో ముఖ్యంగా కువైట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రవాసులు అధిక సంఖ్యలో జైళ్లలో మగ్గుతున్నారు. కువైట్ కేంద్ర కారాగారంలో మాదక ద్రవ్యాలకు సంబంధించిన నేరాలపై శిక్ష అనుభవిస్తున్న భారతీయ ఖైదీలలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే అత్యధికంగా ఉన్నారు. హెరాయిన్ కంటే స్వల్ప ప్రభావం కలిగిన ఔషధ మందులు, గంజాయిని రవాణా చేస్తూ పట్టుబడ్డ వారు యు.ఎ.ఇ., ఖతర్ తదితర దేశాలలోని జైళ్లలో మగ్గుతున్నారు. దురదృష్టవశాత్తు వీరి నేరాల విషయమై స్వదేశంలోని పోలీసులు లోతుగా విచారణ చేయలేకపోతున్నారు. కొన్ని కేసులలో దర్యాప్తునకు సహకరించడానికి కుటుంబ సభ్యులు ముందుకు రావడం లేదు. మరి కొన్ని కేసులలో స్మగ్లింగ్ ముఠాలు గల్ఫ్ జైళ్లలో మగ్గుతున్న వారి కుటుంబ సభ్యులకు నెలకు కొంత మొత్తం పారితోషికం ఇస్తున్నారు. దీంతో సంబంధిత ఖైదీల కుటుంబాలు కూడా దర్యాప్తునకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విదేశాలకు అక్రమ రవాణా అటుంచి స్వదేశంలోనూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతోంది. హైదరాబాద్‌తో సహా దేశవ్యాప్తంగా పలు నగరాలలో యువతీయువకులు మాదక ద్రవ్యాల వ్యసనానికి గురవుతున్నారు. గల్ఫ్‌లో పుట్టిపెరిగిన కొంత మంది పిల్లలను వారి తల్లిదండ్రులు ఉన్నత విద్యాభ్యాసానికై హైదరాబాద్‌కు పంపించడానికి డ్రగ్స్ కారణంగా భయపడుతున్నారు. ఈ క్రమంలో స్కూళ్లు, కాలేజీల్లో నిఘా పెంచాలి. పిల్లలు ఎవరితో వెళుతున్నారో గుర్తించాలి. కాలేజీలు, స్కూళ్ల పరిసరాల్లో సిసి కెమెరాలను పెంచాలి. దీంతో పిల్లల యోగక్షేమాలకు కూడా అవకాశం ఏర్పడుతుంది. దేశంలో యువతను డ్రగ్స్ మహమ్మారి నుంచి కాపాడే యత్నం చేయాలి. డ్రగ్స్ రవాణాపై మరింత కఠనంగా వ్యవహరిస్తే తప్ప ఇది సాధ్యం కాదు.

# నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీ

**ఏర్పాట్లను పరిశీలించిన సిపి సజ్జన్నార్... పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు... పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ డైవర్షన్**



**హైదరాబాద్, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చేప మందు పంపిణీ సందర్భంగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భద్రతా ఏర్పాట్లను హైదరాబాద్ సీపీ సజ్జనార్ పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్యూలైన్లు, కౌంటర్లు, మినీ కమాండ్ కంట్రోల్ సెంటర్ పని తీరును పరిశీలించారు. సీపీతో పాటు జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, గోల్కొండ డీసీపీ చంద్ర మోహన్ ఏర్పాట్లను పరిశీలించారు. ఇప్పటికే నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేప మందు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. దీంతో నాంపల్లి మెట్రో పరిసర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో భక్తుల కోసం చేప ప్రసాదం పంపిణీ సందర్భంగా వైద్య, అగ్నిమాపక శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. చేప ప్రసాదం కోసం వచ్చిన వారి కోసం 3 హెల్త్ క్యాంప్‌లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల కోసం 5 అంబులెన్సులను సిద్ధం చేశారు. అస్వస్థతకు గురైన వారికి అక్కడికక్కడే ప్రాథమిక చికిత్స అందించనున్నారు. అవసరమైతే ఉస్మానియా ఆస్పత్రికి తరలింపుకు ఏర్పాట్లు చేశారు. వైద్య సిబ్బందితో హెల్త్ టీమ్ 24 గంటలూ అప్రమత్తంగా ఉండనుంది. భద్రతా చర్యల్లో భాగంగా 3 ఫైర్ ఇంజిన్లు అందుబాటులో ఉన్నాయి. భారీ జనసందోహం నేపథ్యంలో ప్రత్యేక అత్యవసర సేవలను ఏర్పాటు చేశారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలను అధికారులు కల్పించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేపమందు పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం తరఫున లక్షకు పైగా చేప పిల్లల ఏర్పాటు చేశారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. ఇప్పటికే దాదాపు 50 వేల మంది నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు చేరుకున్నారు. సాయంత్రం 7 గంటల నుంచే క్యూలైన్లలో ఉండనున్నారు. రాత్రి 9 గంటల 1 నిమిషానికి చేపమందు పంపిణీ ప్రారంభంకానుంది. శుభ ముహూర్తం ప్రకారమే చేపమందు పంపిణీని నిర్వాహకులు ప్రారంభించనున్నారు. ఉబ్బసం, ఆస్తమా బాధితులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. భద్రత, వైద్య సదుపాయాలు, తాగునీటి ఏర్పాట్లతో అధికారులు సిద్ధమయ్యారు. చేపమందు పంపిణీ నేపథ్యంలో నాంపల్లి పరిసరాల్లో ప్రత్యేకంగా ట్రాఫిక్ నిబంధనలు విధించారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ రోజు రాత్రి 9 గంటల నుంచి చేప ప్రసాదం పంపిణీ ప్రారంభం కానుందని చెప్పారు.

# హర్ముజ్ వద్ద బారత ప్రయాణికుల నౌకపై దాడి

**దాడిలో తీవ్రంఅ దెబ్బతిన్న ఇంజన్**

**న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ, భారతీయులు ప్రయాణిస్తున్న ఓ కార్గో నౌక దాడికి గురైనట్టు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఈ దాడి జరగ్గా.. ఆ సమయంలో నౌకలో 24 మంది భారతీయులున్నారని సమాచారం. దీంతో అత్యవసర సహాయం కోసం నౌకలోని సిబ్బంది అభ్యర్థించినట్టు వార్తలు వస్తున్నాయి. పలావు దేశ జెండాతో వెళ్తున్న నౌక ఒమన్ తీరానికి దగ్గర్లో ఉన్న సమయంలో ఈ దాడి జరినట్టు తెలుస్తోంది. ఆ సమయంలో ఆ నౌకలో 24 మంది భారతీయులున్నట్టు సమాచారం. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ దెబ్బతిందని, నౌకకు రంధ్రం పడిందని, దాంతో సిబ్బంది ఎస్ఓఎస్ కాల్ పంపినట్టు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ దాడి కారణంగా నౌకలోని లైఫ్ బోట్లు కూడా దెబ్బతిన్నట్టు సమాచారం. దాడి కారణంగా ఆ ఓడలో పలువురు గాయపడినట్టు తెలుస్తోంది. లైఫ్‌బోట్లు కూడా దెబ్బతినడంతో తరలింపు పక్రియ సంక్లిష్టంగా మారినట్టు సమాచారం. కాగా, నౌకపై క్షిపణులు లేదా డ్రోన్‌లతో దాడి జరిగినట్టు వార్తలు వస్తున్నాయి. ఈ దాడికి బాధ్యులు ఎవరనే విషయంలో స్పష్టత లేదు. ఈ దాడికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**ఇరాన్‌ను వీడాలని భారత్ అడ్వైజరీ**

న్యూఢిల్లీ,జూన్8(ఆర్ఎన్ఎ): ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మరోసారి తీవ్రస్థాయిలో దాడులు జరుగుతున్నాయి. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత ఎంబసీ అడ్వైజరీ జారీ చేసింది. తక్షణమే ఇరాన్‌ను వీడాలని అక్కడి భారత పౌరులకు సూచించింది. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా పరిణామాల దృష్ట్యా ప్రస్తుతానికి భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలను మానుకోవాలని సూచిస్తున్నాం. ఇక, ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో వెంటనే ఆ దేశాన్ని వీడాలని హెచ్చరిస్తున్నాం అని ఎంబసీ తమ అడ్వైజరీలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో ఘర్షణలు మొదలైన నాటినుంచి భారత్ పలుమార్లు ఇలాంటి ప్రయాణ సూచనలు జారీ చేసింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత దాదాపు 1600 మందికి పైగా భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించింది. ఇక, ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల పశ్చిమాసియా దేశాల నుంచి దాదాపు 6 లక్షల మంది భారత పౌరులు స్వదేశానికి తిరిగొచ్చినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. ఇదిలాఉండగా.. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది.

# నేడు ఎపిలో భారీ వర్షాలు కురిసే ఛాన్స్

**- ఈదురుగాలులు వీచే అవకాశం - అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక**

**అమరావతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో మంగళవారం అక్కడక్కడ ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సోమవారం వెల్లడించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో భారీ వర్షాల సూచన ఉందని తెలిపింది. ఇక కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పిడుగులతో పాటు వర్షాలు పడతాయని తెలిపింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. వైఎస్సార్ కడప జిల్లాలో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. అల్లూరి సీతారామరాజు, మార్కాపురం జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వివరించింది. మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాల కురుస్తాయని సూచించింది. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడ వద్దని ప్రజలకు స్పష్టం చేసింది. అలాగే భారీ హోర్డింగ్స్ ప్రాంతాల్లో ఉండ వద్దని ప్రజలకు తెలిపింది. ల్గ÷తులు, పశువుల కాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉరుములు వినిపించగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని స్పష్టం చేసింది. తెగిపోయిన విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని హెచ్చరించింది. ఉత్తరాంధ్రలోని కొన్ని ప్రాంతాల్లో 42 - 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎండ తీవ్రత కొనసాగనుందని తెలిపింది. పార్వతీపురం మన్యం, పోలవరం, ఏలూరు ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 40 - 42 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నెలకొంటాయని చెప్పింది. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కూడా ఎండ తీవ్రత కొనసాగనుందని విపత్తు నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.

## మొదటి పేజీ తరువాయి

# ప్రజల భవిష్యత్ బాగు చేసే బాధ్యత ప్రభుత్వానిదే



ముఖ్యమంత్రి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈ జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రజల మధ్య చిచ్చు పెట్టారని.. గొడవలు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ప్రజల భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టిందని మండిపడ్డారు. గొడ్డలి పట్టుకునే వారికి నాగలి పట్టుకున్న రైతు గుర్తుకు రాలేదని వ్యాఖ్యానించారు. 'మీ భూమి మీద సైకో ఫొటో వేశారు. భూమి మీది.. ఫొటో సైకోది.. నిద్ర లేస్తూనే ఆయన మొహం చూడాల్సి వచ్చేది. జగన్ పిచ్చితనానికి ట్రీట్‌మెంట్ ఎక్కడ ఉందో తెలీదు. మీకేమైనా తెలిస్తే, ఆ అడ్రస్ ఆయనకు పంపుతాను' అంటూ సీఎం చంద్రబాబు సెటైరికల్ కామెంట్స్ చేశారు. రీసర్వేలో రైతులను భాగస్వాములను చేశామని చెప్పారు. 6,688 గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూ రికార్డులు అప్‌డేట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 26 లక్షల పాస్ పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. నిషేధిత జాబితా 22ఎలో ఉన్న భూ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రైతుల ఖాతాల్లో రూ.8వేల కోట్ల అన్నదాత సుఖీభవ నిధులు జమ చేశామని చంద్రబాబు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు నగదు చెల్లింపులు జరుగుతున్నాయన్నారు. త్వరలో ఆక్వా రైతుల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రంలో భూ రికార్డుల సంస్కరణలు, రైతుల హక్కుల పరిరక్షణ, వ్యవసాయాభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జిల్లాలు దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా నిలిచాయని కొనియాడిన సీఎం.. ఈ ప్రాంత రైతులు భూమిని సమర్థంగా వినియోగించుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ఇప్పుడు రైతుల భూ రికార్డులను ఎవరూ ట్యాంపర్ చేయలేరని, భూ సమస్యల పరిష్కారం కోసం బ్లాక్ చైన్ టెక్నాలజీ తీసుకొచ్చాం సీఎం చెప్పుకొచ్చారు. భూమి రికార్డులను మరింత భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. బ్లాక్‌చైన్ టెక్నాలజీ, క్యూఆర్ కోడ్‌లు, అధునాతన భద్రతా ఫీచర్లతో కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నాము. కరెన్సీ నోట్లకు ఉండే భద్రతా ప్రమాణాల తరహాలో రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతులకు అందిస్తున్నాము. రీ-సర్వే, ఈ-కేవైసీ పక్రియల అనంతరం మాత్రమే పాస్ పుస్తకాలు ముద్రిస్తున్నామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ-సర్వే పూర్తి చేసి 26.46 లక్షల మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసాము. ఇంకా 62.32 లక్షల పుస్తకాలు పంపిణీ చేయాల్సి ఉంది, నిర్ణీత గడువులోగా 90 లక్షల మంది భూ యజమానులకు పాస్ పుస్తకాలు అందజేయడమే లక్ష్యం. గత పాలనలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు మూడు సంవత్సరాల పాటు కృషి చేయాల్సి వచ్చింది. రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకొస్తున్నాము. రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేసాం. అమ్మకం, బహుమతి, విభజన వంటి 9 లక్షల భూ లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ వ్యవస్థను అమలు చేస్తున్నాము. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేస్తూ రూ.10 లక్షల లోపు ఆస్తులకు కేవలం రూ.100తో బదిలీ సౌకర్యం కల్పించాము. అంతకంటే ఎక్కువ విలువ గల ఆస్తులకు రూ.1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది' అని సీఎం చెప్పారు. అలాగే పాత భూ రికార్డుల డిజిటలైజేషన్ వేగంగా కొనసాగుతోందని.. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ రికార్డులను డిజిటల్ రూపంలోకి తీసుకువస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని, 15 జిల్లాల్లోని 33,012 ఎకరాల షరతు గల పట్టా భూములపై ఆంక్షలను కూడా ఎత్తివేసినట్లు వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోందని సీఎం స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ పథకం కింద మూడు విడతల్లో 46 లక్షల మంది రైతులకు రూ.8,985 కోట్లు జమ చేశామని, కేంద్ర ప్రభుత్వ సహాయంతో కలిపి ప్రతి రైతుకు సంవత్సరానికి రూ.20 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో ధాన్యం అమ్మిన రైతులకు డబ్బులు రావడానికి నెలల తరబడి పట్టేదని, ప్రస్తుతం 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. గోదావరి డెల్టా ప్రాంతంలో కాలువలు, చెరువుల మరమ్మతులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆక్వా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఆక్వా చెరువులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, దాణా ధరలు పెరగడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించాలని కేంద్రాన్ని కోరినట్లు వెల్లడించారు. ఆక్వా రంగం రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థలకు కీలకమని పేర్కొన్న సీఎం, ఆ రంగానికి అన్ని విధాలా మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. ఆక్వా పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను వినియోగించి న్యూట్రాస్యూటికల్ ఔషధాల తయారీకి అవకాశాలు ఉన్నాయని కూడా సూచించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# మోదీ పాలనతో చిక్కుల్లో దేశం

రంగాల్లో ప్రైవేట్ గుత్తాధిపత్యాలు పెరుగుతున్నాయని తెలిపారు. మరోవైపు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ తో లక్షలాది మంది ప్రజలు ఓటు హక్కును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఎస్ఎమ్ఈ రంగం తీవ్ర సంక్షోభంలో పడిందన్నారు. మోదీ ప్రభుత్వంలో పరీక్షల నిర్వహణ వైఫల్యాలతో యువత నష్టపోతున్నారని ఖర్గే చెప్పుకొచ్చారు. మూడేళ్ల క్రితం ఇండియా కూటమి ఏర్పడిందని, పార్లమెంటులో ఇటీవల దాని బలం ఏంటో అధికార పక్షం రుచి చూసిందన్నారు. లోక్‌సభలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డీలిమిటేషన్ బిల్లును ఓడించేందుకు ఈ ఏడాది ఏప్రిల్ 17న కూటమి పార్టీలు దృఢంగా ఏకమయ్యాయని ఖర్గే ప్రశంసించారు. ఇప్పుడు ఆ స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలన్నారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపక్షం ఐక్యంగా ఉండాలన్నారు. కీలక సమావేశానికి 23 ప్రతిపక్ష పార్టీల నేతలు హాజరయ్యారు. వారిలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అఖిలేష్ యాదవ్, తేజస్వీ యాదవ్, మమతా బెనర్జీ, దీపాంకర్ భట్టాచార్య, మెహబూబా ముఫ్తీ, సుప్రియా సూలే, బ్రివన్ థోల్ తదితరులు ఉన్నారు. అయితే, కీలక భాగస్వాములైన డీఎంకే, ఆప్ పార్టీలు మాత్రం సమావేశానికి దూరంగా ఉన్నాయి.

# టీఎంసీకి మరో ఎదురుదెబ్బ

ప్రాధాన్యం సంతరించుకుంది. టీఎంసీలో అత్యంత వాక్చాతుర్యం గల సీనియర్ నాయకులలో ఒకరిగా సుఖేందు పేరు సంపాదించారు. పార్టీని వీడుతున్నట్లు సుఖేందు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి లేఖ రాశారు. అందులో పార్టీలో విచ్చలవిడిగా పెరిగిపోయిన అవినీతిని, మహిళలపై తీవ్ర అణచివేతను, విద్య, ఆరోగ్య సంరక్షణ, పరిశ్రమ, ఉపాధి, శాంతిభద్రతలతో సహా పలు రంగాలలో నెలకొన్న తీవ్ర అరాచకాన్ని ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు. మరోవైపు భాజపాపై ప్రశంసలు కురిపించారు. బెంగాల్ చరిత్రలో తొలిసారిగా ఓటర్లు ఆ పార్టీకి భారీ విజయాన్ని అందించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన హామీల అమలు దిశగా కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ప్రశంసించారు. ఇప్పటికే దాదాపు 61 మంది ఎమ్మెల్యేలు పార్టీ రెబల్ నేత రితబ్రతకు మద్దతివ్వడంతో శాసనసభలో ప్రతిపక్ష నాయకుడిగా స్పీకర్ ఆయనను నియమించారు. అసమ్మతి ఎమ్మెల్యేలతో ఆ పార్టీ ఎంపీలు కూడా టచ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో సుఖేందు తన పదవికి రాజీనామా చేయడం గమనార్హం. మరో ఎంపీ కోయల్ మల్లిక్ కూడా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేయనున్నట్లు వార్తలు వస్తున్నాయి. దిల్లీలో నేడు జరగనున్న ఇండియా కూటమి కీలక భేటీలో పాల్గొనడానికి మమత దేశ రాజధానికి వెళ్లిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది.

# పరీక్షలంటే తెలియని వారు విమర్శలా

తెలియనివాళ్లు విమర్శలు చేస్తున్నారని అంటూ సీఎం దుయ్యబట్టారు. తెలంగాణలోనూ వైసీపీ నేతలు భూములను కాజేయాలని చూశారని సీఎం తెలిపారు. ఇక్కడ చాలదన్నట్లు.. తెలంగాణలోనూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. కోడికత్తి డ్రామాలు చేసేవారికి రైతుల బాధలు తెలియవన్నారు. తిరుమల దేవదేవుడి అంశంలోనూ ద్రోహం చేశారని మండిపడ్డారు. కలియుగ దైవం వేంకటేశ్వర స్వామిని అపవిత్రం చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే దుర్మార్గులను దూరం పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని విమర్శించారు. ఒక్క పరిశ్రమ రాలేదని.. యువతకు ఉద్యోగాలు లేకుండా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డులు తారుమారు కావడం వల్ల అనేక వివాదాలు తలెత్తాయి. ఒకప్పుడు బ్రిటిష్ కాలం నుంచి కొనసాగిన పటిష్టమైన భూ రికార్డుల వ్యవస్థ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు తక్కువగా ఉండేవి. కానీ గత పాలకుల నిర్వాకంతో భూ యాజమాన్య సమస్యలు పెరిగిపోయాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరిట తీసుకొచ్చిన చట్టం రైతుల భూములపై అనిశ్చితి సృష్టించింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ చట్టాన్ని రద్దు చేసి రైతుల యాజమాన్య హక్కులను కాపాడామని వివరించారు.

# సమాజానికి వైసిపి తీవ్ర హానికరం

విషయాన్ని ప్రతిరోజూ కూటమి నేతలు ప్రజలకు చెప్పాలని పేర్కొన్నారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ప్రత్యర్థి ప్రజాస్వామ్యవాది కాదని.. అధికారం కోసం ఎన్ని అడ్డదార్లయినా తొక్కేందుకు సిద్ధపడతారని ఎద్దేవా చేశారు. సోమవారం నంద్యాల జిల్లాలో మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎప్పుడూ లైన్ దాటి అధికారాన్ని ఉపయోగించరని, కానీ జగన్ రెడ్డి రోజూ లైన్ దాటుతారని చెప్పారు. ఏపీలో జగన్ అరాచక పాలన మళ్లీ రాకూడదంటే.. 'గొడ్డలి పార్టీ నెవర్ అగైన్, కూటమి అగైన్ అండ్ అగైన్' అని చాటి చెప్పాలని మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ప్రజలు ఇచ్చిన 93శాతం స్ట్రైక్ రేటుతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిందని వ్యాఖ్యానించారు. నాడు పోలింగ్ బూత్ స్థాయిలో వెనకడుగు వేయకుండా జెండా పట్టుకుని నిలబడిన ప్రతి కార్యకర్త శ్రమ, ధైర్యమే ఈ విజయానికి కారణమని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగాలను మరిచిపోతే ఏ రాజకీయ నాయకుడు, ఏ రాజకీయ పార్టీ కూడా మనుగడ సాగించలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా గెలవబోయే నాయకులందరి కోసం తాము కష్టపడాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గ్రూపు రాజకీయాలు కడితే పతనం తప్పదని మంత్రి పయ్యావుల హెచ్చరించారు. కార్యకర్తలు, నేతలు అలకలు వీడాలని అన్నారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అలిగి పార్టీకి దూరమవ్వద్దని చెప్పారు. కొట్లాడి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. రాయలసీమ రాజకీయాల్లో అప్రమత్తత అవసరమని తెలిపారు. గొడ్డలి పార్టీపై నిరంతర పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మనం ప్రభుత్వంలో ఉన్నామని నిద్రపోవద్దని చెప్పారు. టీడీపీ శ్రేణులు ఓటర్ లిస్ట్‌పై పట్టు సాధించాలని దిశానిర్దేశర చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# రిబ్బన్ కట్ చేసిన మూడు రోజులకే కుంగిపోయిన అన్నక్యాంటీన్ ప్రాంగణం

### - నాసిరకం నిర్మాణ పనులపై సర్వత్రా విమర్శల వెల్లువ







**సత్యవేడు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సత్యవేడులో నూతనంగా నిర్మించిన అన్నక్యాంటీన్ భవన ప్రాంగణం పలుచోట్ల కుంగి పోయింది. అన్నక్యాంటీన్ భవనానికి ఒకపక్క స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జూన్ మూడవ తేదీన రిబ్బన్ కట్ చేసి అల్పాహారాన్ని ప్రారంభించగా, అదేరోజు మధ్యాహ్నం టిడిపి నియోజకవర్గ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కూరపాటి శంకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి మధ్యాహ్న భోజనాన్ని పలువురుకు వడ్డించారు. అయితే రిబ్బన్ కట్ చేసిన మూడు రోజులకే అన్న క్యాంటీన్ భవన ప్రాంగణం పలుచోట్ల కుంగిపోయింది. ప్రధానంగా అన్న క్యాంటీన్ వెనుక వైపు భోజనం ప్లేట్లు శుభ్రం చేసే ప్రాంతంలో రెండు చోట్ల అడుగుభాగం కుంగి పోవడంతో పార్కింగ్ టైల్స్ దెబ్బతిన్నాయి. దీంతోపాటు అన్న క్యాంటీన్ కు ఏర్పాటుచేసిన వాటర్ ట్యాంక్ కూడా లీక్ అవుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి ప్రభుత్వం 61 లక్షల రూపాయలను మంజూరు చేసింది. నిర్మాణ పనులను హైదరాబాదు ఎన్సిసి లిమిటెడ్ ఏజెన్సీ చేపట్టింది. అయితే వీరు నిర్మాణ పనులను సత్యవేడు పట్టణంలోని వైసిపి నాయకుడికి అప్పగించారు. ఈ క్రమంలో వైసీపీ నాయకుడు ఆరు నెలల క్రితమే పనులను చేపట్టి అన్నక్యాంటీన్ భవనాన్ని పూర్తి చేశారు. కానీ అన్న క్యాంటీన్ భవన నిర్మాణం పనులు నాసిరకంగా జరగడం వల్ల ప్రారంభించిన మూడు రోజులకే ప్రాంగణంలోని పలుచోట్ల అడుగుభాగం కుంగి పోవడంతో టైల్స్ అన్ని లేచిపోయాయి. తిరుపతి పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు అన్నక్యాంటీన్ నిర్మాణ పనులను పర్యవేక్షించారు. నాణ్యతకు సంబంధించి తిరుపతి పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లు సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ భవన నిర్మాణంలో కూడా నాణ్యతకు తిలోధకాలు ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా దీనిపై జిల్లా అధికారులు స్పందించి అన్న క్యాంటీన్ భవనప్రాంగణంలో కుంగిపోయి దెబ్బతిన్న పార్కింగ్ టైల్స్ను బాగు చేయించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఓవర్ హెడ్ ట్యాంక్ లీకేజ్ను కూడా అరికట్టాల్సిన అవసరం ఉంది.

# నెల రోజులుగా వెలగని వీధి దీపాలు



**సూళ్లూరుపేట, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట మండల పరిధిలోని కొన్నెంబట్టు గ్రామంలో నెల రోజులుగా వీధి విద్యుత్ దీపాలు పనిచేయకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో గ్రామమంతా చీకటిమయం కావడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వీధి లైట్లు పనిచేయడం లేదని పలుమార్లు పంచాయతీ సెక్రటరీకి తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటి వరకు పరిష్కారం కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి నెలకొంది. చీకటి కారణంగా రాత్రి సమయంలో గ్రామంలో సంచరించడం కష్టంగా మారిందని, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు తెలిపారు. విషపురుగులు, పాముల భయం కూడా పెరిగిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దృష్టికి సమస్యను మీడియా ద్వారా ఎమ్మెల్యే తెలియజేయాలని, వెంటనే స్పందించి వీధి విద్యుత్ దీపాలను మరమ్మతు చేయించి గ్రామానికి వెలుగులు తీసుకురావాలని కోరారు. నెల రోజులుగా చీకట్లోనే జీవిస్తున్నాం. అధికారులు వెంటనే స్పందించి వీధి లైట్లను బాగు చేయాలి అని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. గ్రామ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని, సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.

# ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల బ్యాగులు నుండి బంగారు ఆభరణాలు దొంగలించిన ముగ్గురు మహిళలు అరెస్ట్




**చంద్రగిరి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండల పరిధిలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల బ్యాగుల నుండి బంగారు ఆభరణాలు దొంగిలిస్తున్న ముగ్గురు మహిళా నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు చిత్తూరు జిల్లాకు చెందిన జి.దివ్య (31), బి.రాధిక (38), బి.మేరీ (33)లుగా గుర్తించి, జూన్ 7వ తేదీ ఆదివారం సాయంత్రం శంఖంపల్లి ఫ్లైఓవర్ కింద ప్రత్యేక పోలీసు బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల వద్ద నుండి సుమారు రూ.3.5 లక్షల విలువైన, 32 గ్రాముల బరువు కలిగిన డైమండ్ గోల్డ్ నెక్లెస్ చైన్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నిందితులు ఆర్టీసీ బస్సుల్లోని రద్దీని ఆసరాగా చేసుకుని, మహిళా ప్రయాణికులే లక్ష్యంగా వారి హ్యాండ్ బ్యాగుల నుండి విలువైన ఆభరణాలను అపహరిస్తున్నట్లు విచారణలో తేలింది. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు, పాకాల సీఐ టి.చిన్న గోవిందు పర్యవేక్షణలో ఎస్.ఐ లు తరుణ్, నాగ మంజులలతో కూడిన ప్రత్యేక బృందం ఈ కేసును ఛేదించింది. నిందితులను కోర్టు ముందు హాజరుపరచగా, న్యాయస్థానం వారిని రిమాండ్‌కు తరలించారు. కేసును వేగంగా ఛేదించిన పోలీసు బృందాన్ని ఎస్పీ అభినందించారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

### - ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ



**నాయుడుపేట, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట. యోగా ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రతతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21)ను పురస్కరించుకుని నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం నాయుడుపేట మండలంలోని పుదురు బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులు, నాయకులుయోగా సాధకులు, సామూహికంగా యోగాసనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో ఏర్పడుతున్న అనారోగ్య సమస్యలను అధిగమించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యతను పెంపొందించే గొప్ప సాధనం యోగా అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించి ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యోగా ద్వారా శారీరక సామర్థ్యం పెరగడంతో పాటు మానసిక ఒత్తిడి తగ్గి జీవన నాణ్యత మెరుగుపడుతుందని వివరించారు. అనంతరం స్వచ్ఛభారత్ స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా గురుకుల పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రం చేసి, మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నిత్యా కృష్ణారెడ్డి, అవధానం సుధీర్, పలుకూరు ముత్యాలయ్య, వినుకొండ ధనుంజయ, ఇమిడి సెట్టి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు రెడ్డి, అరిగొండ జయరామ్, శేషం ముని గోపి, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు, అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.

# హోటల్స్ జట్టుపై సచివాలయం జట్టు విజయం




**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేణుగోపాల్ నాయుడు మెమోరియల్ తిరుపతి కార్పొరేట్ లీగ్ పోటీలలో సోమవారం ఉదయం జరిగిన మ్యాచ్ లో సచివాలయం జట్టు, తిరుపతి హోటల్స్ జట్లు తలపడ్డాయి. టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన సచివాలయం జట్టు 18 ఓవర్లలో 122 పరుగులు చేసి ఆల్ అవుట్ అయింది. 123 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన తిరుపతి హోటల్స్ జట్టు చివరి వరకు పోరాడి నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 119 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో సచివాలయం జట్టు 3 పరుగుల తేడాతో హోటల్స్ జట్టు పై ఘన విజయం సాధించింది. బ్యాటింగ్ లో 27 పరుగులు, బౌలింగ్ లో 4 వికెట్లు సాధించిన సాయి ప్రమోద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు.

**బెన్ఫిషరీ మ్యాచ్ లో ఎన్.ఎస్.యు జట్టు విజయం**


మధ్యాహ్నం జరిగిన బెన్ఫిషరీ మ్యాచ్ లో నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ జట్టు జేశాప్ జట్టుపై విజయం సాధించింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన ఎన్.ఎస్.యు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. 144 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి తిరిగిన జేశాప్ 15 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసింది. దీంతో నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. బౌలింగ్ లో 4 వికెట్లు, తీసుకొని బ్యాటింగ్ లో 33 పరుగులు చేసిన సంతోష్ మాజీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. ఈ అవార్డు కార్యక్రమానికి ఎన్.ఎస్.యు స్పోర్ట్స్ ఆఫీసర్ రవినాయుడు, సిడిసిఏ జాయింట్ సెక్రెటరీ కోలాహరి, ఫిజియో జ్యోతి ముఖ్య అతిథులుగా పాల్గొని మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు.

# పేటలో ప్రజల మనిషి మాజీ మంత్రి పసల పెంచలయ్య వర్ధంతి వేడుకలు



**నాయుడుపేట, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, మాజీ తిరుపతి పార్లమెంట్ సభ్యులు పసల పెంచలయ్య గారి 11వ వర్ధంతి వేడుకలు సోమవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయుడుపేట పట్టణం లోని తుమ్మూరు వద్ద గల ఆయన సమాధి వద్ద పసల పెంచలయ్య చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పలువురు వైసీపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ పసల పెంచలయ్య ప్రజాసేవకు తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత నాయకుడని అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. రాష్ట్ర మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయ మన్నారు. ప్రజలతో మమేకమై వారి సంక్షేమం కోసం నిరంతరం శ్రమించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. రాజకీయాల్లో విలువలు, నిజాయితీ, నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన పసల పెంచలయ్య ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ ప్రజలకు సేవ చేయడమే పసల పెంచలయ్య నిజమైన నివాళి అని కిలివేటి సంజీవయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, వైసీపీ ఓజిలి మండల అధ్యక్షులు పాదర్తి హరినాథ్ రెడ్డి, వైయస్సార్సీపి యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాలూరు దశరధి రామి రెడ్డి, వైసీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పాలేటి నాగార్జున, మాజీ కౌన్సిలర్లు షేక్ షబ్బీర్, నాయకులు పేర్నాటిరాహుల్, తన్నమాల రమణయ్య మీజూరు బాల, కలగంధ సునీల్, చందు, ఆర్కాట్ శాంత కుమార్ పలువురు నాయకులు పసల పెంచలయ్య ఘన నివాళులర్పించారు.

# ఘనంగా మాజీ కౌన్సిలర్ నవీన్ కుమార్ జన్మదిన వేడుకలు



**పలమనేరు , జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు మున్సిపాలిటీ లోని మాజీ కౌన్సిలర్ నవీన్ కుమార్ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా గంటవూరు బీసీ కాలనీ లోని శ్రీ తిరుపతి గంగమ్మ గుడి ఆవరణంలో ఘనంగా శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పట్టణంలోని పేద ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారని అలాంటి వ్యక్తి జన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మాజీ కౌన్సిలర్ నవీన్ కుమార్ జన్మదిన సందర్భంగా పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ తిరుపతి గంగమ్మ గుడి చైర్మన్ డాక్టర్ మురుగన్, కిషోర్, గోవిందప్ప, బాబు, మహేష్, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.


# నల్ల బ్యాడ్జీలతో వీఆర్వోల నిరసన

**పుంగనూరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్నంలోని ఎమ్మార్వో కార్యాలయం మీదట సోమవారం ఉదయం నల్ల బ్యాడ్జీలు ధరించి వీఆర్వోలు నిరసన తెలిపారు వారు మాట్లాడుతూ, కర్నూలు జిల్లా వెంకయ్య పాలెం లో వీఆర్వో చనిపోయిన ఘటనను గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు మూడు రోజులు పాటు నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. వీఆర్వోలపై పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు.

# తిరుపతి జిల్లా

# కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయోత్సవ సభకు ప్రజలు తరలి రావాలి

### - జయచంద్ర నాయుడు



**శ్రీకాళహస్తి రూరల్, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, తొట్టంబేడు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాడపల్లి జయచంద్ర నాయుడు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి , చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం విజయవంతంగా రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించనున్న ప్రజా విజయోత్సవ సభకు ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే ఈ సభ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అలాగే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి సంబంధించి భవిష్యత్ కార్యాచరణ, కీలక నిర్ణయాలను కూడా ఈ వేదికపై ప్రకటించే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల విజయవంతమైన పాలనకు గుర్తుగా నిర్వహిస్తున్న ఈ ప్రజా విజయోత్సవ సభ ఆంధ్రప్రదేశ్ రాజకీయ చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టంగా నిలుస్తుందని జయచంద్ర నాయుడు పేర్కొన్నారు.

# నిరుపేద వ్యాధిగ్రస్థులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయం

### - ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జరీనా

**గూడూరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక గూడూరు ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల లో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం జరిగింది. 'డాక్టర్ సి.ఆర్. రెడ్డి ఆరోగ్య సంజీవని' పేరిట ప్రముఖ దాతలు వైద్యులు డాక్టర్ సి. జనార్దన్ రెడ్డి, డాక్టర్ సి. రోహిణి ల సంపూర్ణ ఆర్థిక సౌజన్యంతో సుమారు 30 మంది నిరుపేద వ్యాధిగ్రస్థులకు ఈ పౌష్టికాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జరీనా మాట్లాడుతూ తీవ్ర వ్యాధులతో బాధపడే నిరుపేద రోగులకు మందులతో పాటు బలమైన పౌష్టికాహారం ఎంతో అవసరమని, ప్రతి నెలా ఈ సేవలు అందిస్తున్న ప్రగతి సేవా సంస్థను అభినందించారు. అనంతరం ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ సంస్థ చేపట్టిన మూడు ప్రధాన లైఫ్-టైమ్ ప్రాజెక్టులలో ఎయిడ్స్ బాధితులకు అండగా నిలవడం ఒకటని పేర్కొన్నారు. దానధర్మాల్లో డాక్టర్ సి.ఆర్.రెడ్డి కుటుంబం ఎప్పుడూ ముందే ఉంటుందని కొనియాడారు. బాధితులలో రోగనిరోధక శక్తిని (ఇమ్యూనిటీ) పెంచేందుకు ప్రభుత్వ ఆసుపత్రి మందులతో పాటు ఈ ఆహారం ఎంతో దోహదపడుతుందన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా రోగులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహన్రావు, వాచి షాప్ రాము, కుమార్ నాయుడు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# కొడియంబేడు వద్ద రోడ్డు ప్రమాదం నలుగురికి గాయాలు





**నాగలాపురం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాగలాపురం మండల పరిధిలోని కొడియంబేడు ప్రాంతంలో సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీంబాక్కం లో బంధువుల ఇంటికి వచ్చిన వీరు తిరిగి శ్రీపెరంబుదూరుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు, ఆ సమయంలో కొడియంబేడు మెయిన్ రోడ్డు ఎక్కగానే ఎదురుగా ఓ లారీ వస్తుండగా, అదే సమయంలో సుందరం బస్సు ద్విచక్ర వాహనానం పక్కకు వచ్చినట్లు సమాచారం. దీంతో వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి, క్షతగాత్రులను నాగలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)కు తరలించి చికిత్స అందించారు. అనంతరం వారి పరిస్థితిని బట్టి మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించినట్లు తెలిసింది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టి, పూర్తి వివరాలు తెలుసుకుంటామని పోలీసులు తెలిపారు.

## గిరిజనులను గృహనిర్బంధం రోడ్డు నిర్బంధం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**నాయుడుపేట, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మున్సిపల్ ఆఫీస్ వద్ద గిరిజన సంఘ నాయకులు సిపిఎం నాయకులు బాధ్యులు నిరసన ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు బత్తయ్య సిపిఎం నాయకులు శివకవి ముకుందా మాట్లాడుతూ నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో జువ్వల పాలెంలో గిరిజనులు గత 30 సంవత్సరాలు నుండి నివాసం ఉంటున్నారు వారిపై ఆ గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి గిరిజనుల ఇంటిముందు జెసిబి తో భారీ స్థాయిలో గుంత తీసి వారిని ఇంటిలో నుండి బయటికి రానివ్వకుండా గృహనిర్బంధం చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నటువంటి యాదవ సామాజిక వర్గానికి చెందిన గోవా మురళి నుండి మాకు రక్షణ కల్పించండి అని గిరిజన కుటుంబానికి చెందిన అద్దూరు రమణయ్య లక్ష్మీ దంపతులు నాయుడుపేటలో ఉన్నటువంటి అధికారులకు అందరికీ అర్జీలు ఇచ్చి మాకు రక్షణ కల్పించండి మహాప్రభో అని బాధపడి వారం రోజులు కావస్తున్న ఆ వ్యక్తిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అధికారుల నిర్లక్ష్యం వహించడం సరికాదని ఆ గిరిజన కుటుంబానికి కాదు నిరంతరం ఆ రోడ్డుపై అనేక గ్రామాలకు రాకపోకలు నిర్వహిస్తూ రద్దీగా ఉండే ఇటువంటి రోడ్డులో జెసిబి తో పెద్ద గుంతలోడి అందరికీ ప్రమాదకర పరిస్థితులను కల్పిస్తున్న ఇన్ని రోజులు ఆ గొంతును పూడిపించి గిరిజన కుటుంబానికి ఆ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న గ్రామస్తులకు న్యాయం చేకూరుస్తుందని మున్సిపాలిటీ కమిషనర్ తో మాట్లాడడంతో ఈరోజు కానీ రెండు రోజుల్లోగా గుంతను పూడిపిస్తాము అని చెప్పి హామీ ఇచ్చారు ఇచ్చిన హామీను నెరవేర్చి ఆ కుటుంబానికి ఇకమీద రక్షణ కల్పించాలని అట్లు కల్పించిన ఎడల పోరాటాలు చేపడతామని వారు అన్నారు.

# రోడ్డు భద్రతా ఉల్లంఘనలపై చర్యలు : జిల్లా ఎస్పీ

**అనంతపురం ,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతను పెంపొందించే దిశగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తూ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉల్లంఘనదారులపై ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, సీటుబెల్ట్ ధరించకపోవడం, ఓవర్ స్పీడ్, అధికలోడ్‌తో వెళ్లే వాహనాలు, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనదారులపై కేసులు నమోదు చేసి ఫైన్లు విధించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పోలీసులు మాట్లాడుతూ... "ప్రజల ప్రాణ భద్రతే మా ముఖ్య లక్ష్యం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, సురక్షితంగా ప్రయాణించాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఇలాగే చర్యలు కొనసాగిస్తాం" అని సూచించారు.

# ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష

**ధర్మవరం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ధర్మవరం కోర్టు హాల్‌లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ గారితో పాటు జిల్లా స్థాయి అధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులతో ధర్మవరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిపై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ గారు పాల్గొని వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ధర్మవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి అధికారి కేవలం తన శాఖకే పరిమితం కాకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముదిగుబ్బ మండల పరిధిలోని మొలకవేముల విద్యుత్ ఉపకేంద్రం పనులను వేగవంతం చేయాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రెవెన్యూ, విద్యుత్, పోలీస్ శాఖలు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ధర్మవరం పట్టణ విద్యుత్ మౌలిక సదుపాయాల బలోపేతంతో పాటు తాడిమర్రి మండలం పిన్నదరిలో ప్రతిపాదిత 33/11 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుపై వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మామిడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

## - జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం



**పలమనేరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మామిడి రైతుల సమస్యలను పరిష్కరించాలని మామిడి రైతుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరుకు వినతి పత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వం 2026 సంవత్సరం మామిడి సీజన్ ప్రారంభమైన జిల్లాలోని మామిడి రైతులు మామిడి రైతు సంఘాల ప్రతినిధులతో చర్చలు జరపకపోవడం అత్యంత బాధాకరం అని చెప్పారు. ప్రభుత్వం జిల్లాలోని మామిడి రైతులు, గుర్తింపు పొందిన మామిడి రైతు సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి పెట్టుబడి ఖర్చులను నిర్ణయించి ప్రతి ఏటా వరుస నష్టాలతో కుదేలవుతున్న మామిడి రైతులకు ఈ సంవత్సరమైనా పెట్టుబడి ఖర్చు తోతాపురి కేజీ 18 రూపాయలుగా నిర్ణయించి మామిడి రైతులకు రేటు ప్రకారం చెల్లించే విధంగా గుజ్జు ఫ్యాక్టరీలని ఆదేశించాలని కోరారు. ఈ 2026 వ సంవత్సరం చిత్తూరు జిల్లా కలెక్టర్ కిలో మామిడి తోతాపురికి 7 రూపాయలు గా నిర్ణయించారు. గత 2025 సంవత్సరం ఇదే ప్రభుత్వం తోతాపూరి కిలో మామిడి కి కనీస పెట్టుబడి ఖర్చు 12 రూపాయలుగా నిర్ణయించారు. దానికి భిన్నంగా ఈ 2026 సంవత్సరం పెరిగిన పెట్రోల్ డీజిల్ పెట్టుబడి ఖర్చులు అదనంగా చేరిన ప్రభుత్వం 50 శాతంధర తగ్గించి నిర్ణయించడం అంటే ప్రభుత్వమే రైతుల్ని ఆర్థికంగా నష్టపోయే విధంగా ప్రోత్సహించడంప్రభుత్వం నిర్ణయించిన 7 రూపాయలు కూడా ఏ ఒక్క గుజ్జు ఫ్యాక్టరీ అమలు చేయడం లేదని ప్రశ్నించారు.ప్రతి ఒక్క గుజ్జు ఫ్యాక్టరీ దగ్గర ధర పట్టిక బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లా స్థాయి అధికారులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని గతంలోని డిమాండ్ చేయడం జరిగిందని ఇప్పటి వరకు ప్రభుత్వం ఆదేశిగా చర్యలు తీసుకోకపోవడం దారుణమని ఇకనైనా ప్రభుత్వ స్పందించి పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు.జూన్ నెల ప్రారంభమైనా ఇంకా కొన్ని ప్రారంభించని గుజ్జు పరిశ్రమలు,ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల వద్ద కాయలను సేకరించేటట్లు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు ఉమాపతి నాయుడు. హేమలత మాట్లాడుతూ.... ఇప్పటికే కొన్ని ప్రారంభించిన గుజ్జు పరిశ్రమలు మెజారిటీ, ట్రేడర్స్ వద్ద తోతాపురి కాయలను లారీలలో దించుకుంటున్నారు. వీరు రైతుల వద్ద కూడా సేకరించేటట్లు తప్పక చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీని మామిడి పంటకు పూర్తి అనుసంధానం చేయాలని కోరడం జరిగింది. ఇప్పటివరకు ప్రభుత్వం ఆదిశగా చర్యలు తీసుకోలేదని ఇకనైనా ప్రభుత్వ స్పందించి మామిడికాయ అనుసంధానం చేయాలని కోరారు. గుజ్జు పరిశ్రమలు గత సంవత్సరం మామిడి రైతులకు ఇంకా ఇవ్వాల్సిన బకాయిలను వెంటనే ఇచ్చేటట్లు చర్యలు తీసుకుని మామిడి రైతులకు ప్రత్యేక మ్యాంగో బోర్డు ను ఏర్పాటు చేయాలని అన్నారు.పకృతి వైపరీత్యాల కారణంగా ప్రతి ఏటా నష్టపోతున్న మామిడి రైతులకు వెంటనే నష్టపరిహారం ఇప్పించి మామిడి పంటను కూడా పంటల బీమా పథకంలో చేర్చి పంటల భీమా వర్తింపజేయాలని మామిడి రైతులకు డిజిటల్ మార్కెట్లు ఏర్పాటు చేయాలని అంటే ప్రతి రైతు పండించిన పంటని డిజిటల్ మార్కెట్ ద్వారా డైరెక్ట్ గా వ్యాపారస్తుడికి అమ్మే విధంగా చర్య తీసుకొని దళారీ వ్యవస్థను నియంత్రించాలని కోరారు.మామిడి రైతులకు ఎరువులు,పురుగు మందులతో పాటు పనిముట్లను 50 శాతం సబ్సిడీతో ఇవ్వాలి రాంపుల ఏర్పాటుకు అనుమతిం చిన ప్రభుత్వం గుజ్జు ఫ్యాక్టరీలలో ఇచ్చే రేటు రాంపులలో కూడా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.మా సంఘం ద్వారా మీకు ఇచ్చిన పది రకాల సమస్య లను వెంటనే పరిష్కార దిశగా తప్పక చర్యలు తీసుకోవాలని మామిడి రైతుల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సంజీవి,ఉమాపతి నాయుడు, బెల్లంకొండ శ్రీనివాసులు ,హేమలత, చెంగ్రాయ, త్యాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా రూ. 5 లక్షల చెక్కు పంపిణీ



**ములకలచెరువు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకలచెరువు మండలం, బురకాయలకోట గ్రామపంచాయతీ, ఎర్ర మాసిపల్లికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త శ్రీనివాసుల నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ ప్రమాద భీమా పథకం కింద రూ 5 లక్షల రూపాయలు పార్టీ కార్యాలయం నుండి మంజూరు చేశారు. ఈ చెక్కును సోమవారం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పాలగిరి సిద్ధప్ప శ్రీనివాసులు నాయుడు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ సిద్దప్ప మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు పార్టీ అండ ఎప్పుడు ఉంటుందన్నారు. పార్టీలో పనిచేసి ఏవైనా ప్రమాదాలకు గురైన, అనారోగ్యం పాలైనా, అనారోగ్యంతో మృతి చెందినా తెలుగుదేశం పార్టీ బీమా పథకం ద్వారా కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటున్నట్లు తెలిపారు. పార్టీ కోసం శ్రమించే ప్రతి కార్యకర్త కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. సీనియర్ కార్యకర్తగా పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన శ్రీనివాసులు నాయుడు లేకపోవడం పార్టీకి పెద్ద లోటుగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి మౌలా, తెలుగు యువత మండల అధ్యక్షులు జేసీబీ సుధాకర్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి చెన్న కృష్ణ , గొడ్డుమారి రవి, శివమూర్తి, సోమశేఖర్ , గోపాల్ రాజు , మురళీధర్ రావు, వలి, మౌలా, బంగారు బాబు, వాహద్ వలి, మునీర్ బాషా, శంకర్ రవి, షాదిక్ హాసన్ వలి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌక దుకాణం డీలర్ పై చర్యలు తీసుకోవాలి


**ములకలచెరువు,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకలచెరువు మండలం, సోంపాల్యం లోని 11 వ చౌక దుకాణంపై ఇటీవల జిల్లా ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు చేసి అధికంగా 900 కిలోల బియ్యం, చక్కర ఉండడంతో చౌక దుకాణం చేయడం జరిగిందని, అవకతవకలకు పాల్పడి ప్రజల కు ప్రభుత్వం అందించే నిత్యవసర వస్తువులను సక్రమంగా పంపిణీ చేయకుండా ప్రజలను ఇబ్బంది పెడుతున్న డీలర్ పై చర్యలు తీసుకొని, డీలర్ షిప్ ను తొలగించాలని, సోమవారం మొలకలచెరువు మండల తాసిల్దార్ కు గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు.

## పెద్దకొండామర్రి నందు కేత్ బచావో అభియాన్



**చౌడేపల్లి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని పంచాయితీ కేంద్రం పెద్ద కొండామరి లో కృషి విజ్ఞాన కేంద్రము, కలికిరి వారి ఆధ్వర్యం లో కేంద్ర మరియు రాష్ట్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ,మరియు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి వారి సూచన మేరకు పొలాల సంరక్షణ పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవికె, కలికిరి సమన్వయకర్త, డాక్టర్ కె. మంజుల మాట్లాడుతూ నేల సంరక్షణకు గాను రైతులు పాటించాల్సిన వివిధ పద్ధతులపై అవగాహన కార్యక్రమాలు జూన్ ఒకటవ తేదీ నుండి 30 జూన్ వరకు వివిధ గ్రామాల్లో చేపట్టుతున్నట్లు తెలిపారు.పచ్చి రొట్ట ఎరువులు,జీవన ఎరువులు మరియు జీవ శిలీంద్ర నాసినులు తప్పని సరిగా వాడాలని రైతులకు సూచించారు. రైతులు పంటలు వేసేముందు పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర వంటి పచ్చి రొట్ట పంటలను పెంచి దుక్కిలో కలియ దున్నాలని తెలిపారు. అలాగే ప్రకృతి లో లభించే వేప, కానుగ, జిల్లేడు లాంటి కొమ్మలను కొట్టి పంటకు వాడుకుంటే ఎరువు గానే కాకుండా చీడ పీడల నియంత్రణ కు ఉపయోగ పడతాయని విశదీకరించారు.దీనివల్ల ఎకరాకు 25% నుంచి 30% రసాయన ఎరువులను తగ్గించవచ్చని తెలిపారు. నేలలో సేంద్రీయ కర్బనం పెరిగి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. అలాగే అంతర పంటలు,ప్రత్యామ్నాయ పంటలు అయిన అపరాలు, చిరు ధాన్యాలు పండించు కోవాలని తద్వారా నేల ఆరోగ్యం వృద్ధి చెందడమే కాకుండా రైతుకు నికర ఆదాయం పెరుగుతుందని తెలియ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అధికారి శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఎరువుల పంపిణీ ఏపీ ఏ ఐ ఎం ఎస్ 2.0యాప్ ద్వారా నేటి నుండి జరుగుతుందని తెలిపారు.భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, వానపాముల ఎరువు మరియు పశువుల ఎరువు వివిధ పంటల్లో ఏవిధంగా వాడాలని తెలియజేశారు. అలాగే యూరియా, డి ఏ పి అందుబాటులో ఉన్నాయని, ఏ రైతుకు, ఏ పంటకు ఎంత అవసరమో అంతే కొనుగోలు చేయాలి అని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ జిల్లా వనరుల కేంద్రం అధికారి పి. రామకృష్ణ రాజు కేవీకే శాస్త్రవేత్త సోమ శేఖర్ బాబు ఆత్మ అధికారి శ్రీ. అమృత్ కుమార్ రెడ్డి వి ఏ ఏ జయంతి అభ్యుదయ రైతు పూల చంద్ర మౌళి రైతులు పాల్గొన్నారు.

## వేరుశనగ విత్తనాల కొరకు నమోదు చేయించుకోవాలి



**చౌడేపల్లి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేరుశనగ విత్తనాల కొరకు రైతులు సచివాలయాలలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు స్థానికంగా ఆయన మాట్లాడుతూ చౌడేపల్లి మండలంకు 1100 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కేటాయించారన్నారు అన్ని రైతు సేవా కేంద్రాలలో ఈనెల తొమ్మిది నుంచి రిజిస్ట్రేషన్లు చేస్తారన్నారు వేరుశనగ విత్తనాలు కావలసిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, ఆధార్ కు లింక్ అయిన మొబైల్ ఫోన్ తీసుకొని తమ రైతు భరోసా కేంద్రంకు వెళ్లి పొందవచ్చునన్నారు . రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బు చెల్లించిన రైతులకు మాత్రమే విత్తనాలు వచ్చిన తరువాత ఇస్తారన్నారు రిజిస్ట్రేషన్ చేసుకోని రైతులకు విత్తనాలు ఇవ్వబడవన్నారు . 30 కేజీల బస్తా పూర్తి ధర రూ. 3060లు సబ్సిడీ రూ. 1224లు పోను రైతు రూ. 1836లు చెల్లించాలన్నారు.

# వైద్య రంగంలో సాంకేతికతే విజయ మంత్రం

## - నైపుణ్యాభివృద్ధితోనే అంతర్జాతీయ అవకాశాలు: వీసీ వినోద్ భట్

## - ఆధునిక ఫిజియోథెరపీ విధానాలపై అపోలోలో ప్రత్యేక వర్క్‌షాప్



**చిత్తూరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్న ఆధునిక పునరావాస చికిత్సా విధానాలపై ది అపోలో యూనివర్సిటీ ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించింది. స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ పరిధిలోని ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో 'ఇన్‌స్ట్రుమెంట్ అసిస్టెడ్ సాఫ్ట్ టిష్యూ మొబిలైజేషన్ (ఐఎస్‌టీఎం) అంశంపై సోమవారం నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌కు విశేష స్పందన లభించింది. క్యాంపస్‌లోని డాక్టర్ ప్రతాప్ సి. రెడ్డి నాలెడ్జ్ సెంటర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ స్పోర్ట్స్ ఫిజియోథెరపిస్ట్, భారత మిక్స్ డిసేబిలిటీ క్రికెట్ జట్టు ఫిజియోథెరపిస్ట్ డా. మయాంక్ పుష్కర్ పాల్గొని విద్యార్థులకు ఆధునిక చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్ ఛాన్సలర్ డాక్టర్ హెచ్. వినోద్ భట్, విశిష్ట అతిథులుగా నియమిత వైస్ ఛాన్సలర్ డా. నితిన్ ఎం. నగర్కర్, రిజిస్ట్రార్ అనిల్ కుమార్ ఎస్. హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ డా. హెచ్. వినోద్ భట్ మాట్లాడుతూ.. వైద్య రంగంలో వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా విద్యార్థులు, అధ్యాపకులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఫిజియోథెరపీ రంగం సంప్రదాయ చికిత్సా విధానాల నుంచి ఆధునిక, శాస్త్రీయ పద్ధతుల వైపు దూసుకెళ్తోందని చెప్పారు. విద్యార్థులకు పాఠ్యాంశాల జ్ఞానంతో పాటు ప్రాయోగిక నైపుణ్యాలను అందించడానికే విశ్వవిద్యాలయం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాల వైద్య సేవలు అందించే సామర్థ్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు.రిసోర్స్ పర్సన్ డా. మయాంక్ పుష్కర్ మాట్లాడుతూ, ఐఎస్‌టీఎం వంటి సాంకేతికతలు కండరాలు, సాఫ్ట్ టిష్యూలకు సంబంధించిన సమస్యలను గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. క్రీడాకారులు, ప్రమాదాలకు గురైన వారు, దీర్ఘకాలిక నొప్పులతో బాధపడుతున్న రోగుల పునరా వాసంలో ఈ విధానం విశేష ఫలితాలను అందిస్తోందని వివరించారు. ఆధునిక ఫిజియోథెరపీ రంగంలో సాక్ష్యాధార ఆధా రిత చికిత్సా విధానాల ప్రాధాన్యాన్ని వివరించిన ఆయన, అనంతరం విద్యార్థు లకు ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించి వివిధ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ కె. భాస్కర్ రెడ్డి, ఫిజియోథెరపీ విభాగాధిపతి డా. వి. కిరణ్, వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. ఎల్. రమ్యకృష్ణ, అధ్యాపకులు, పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

## సిమెంటు రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల



**చిత్తూరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 5 వ వార్డు కామేశ్వరనగర్ లో సిమెంటు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ భూమి పూజ చేశారు. సోమవారం ఉదయం వార్డులో పర్యటించారు. కామేశ్వరనగర్ మొదటి క్రాస్ లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులను ఎమ్మెల్యే, స్థానిక నాయకులతో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని చెప్పారు. స్థానిక నాయకులు, మహిళలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన వీధులకు సిమెంట్ రోడ్డు వేయాలని కోరగా దశల వారీగా సిమెంట్ రోడ్లు వేయిస్తామన్నారు. అనంతరం స్థానికంగా ఉన్న శనీశ్వరస్వామి ఆలయానికి వెళ్లి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి నరసింహప్రసాద్, చుడ చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, సిసి రోడ్డు కాంట్రాక్టర్ ప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీలో పలువురు చేరిక



**పలమనేరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు నియోజకవర్గం పరిధిలోని వీకోట మండలంలోని చింతమాకులపల్లి గ్రామ పంచాయతీకి చెందిన మండల అధ్యక్షులు ఏ.వి బాబు సహకారంతో నరసింహారెడ్డి, రవి రెడ్డి, శ్రీనివాసులు, చిన్ని, శివ శంకర్, మైనా వారి రమేష్, మైనా వారి పరంధామ్, వీరందరిని జనసేన జిల్లా కార్యదర్శి పూల చైతన్య మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ వారందరికీ జనసేనపార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... జనసేన పార్టీ విధి విధానాలు పారదర్శకత పాలనలో చేరడం తమకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని తెలిపారు. జనసేనపార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి విస్తృతంగా తెలియజేయాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## మలేరియా రహిత సమాజాన్ని నిర్మిస్తాం : డా.పూజిత



**రామకుప్పం , జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని విజలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డాక్టర్ కే పూజిత మరియు డాక్టర్ సాయి ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించడం నిర్వహించారు. ఈ డాక్టర్ పూజిత డాక్టర్ సాయి శ్రీ మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూన్ 1వ తేదీ నుండి 30 తేదీ వరకు జరుగుతుందని ఈ కార్యక్రమంలో భాగంగా మల్యాల అంతం మన పంతం మలేరియా రహిత సమాజం కోసం ఇప్పుడు మనం సాధించగలం ఇప్పుడు మనం తప్పక సాధించాలనీ మలేరియా రహిత సమాజాన్ని నిర్మించ దానికి అందరూ కృషి చేయాలని కోరారు. వైద్య సిబ్బంది మరియు ప్రజలు విజిలాపురంను ప్రధాన రహదారి కూడలి ఇందు మానవహారంగా ఏర్పడి మల్యాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా చూసుకోవాలని ఇది మన అందరి బాధ్యత అని ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిస్తూ ఎక్కడ నీరు నిలువ లేకుండా చూసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎల్తేజికేటర్ ప్రమీల మరియు సి హెచ్ ఓ లు, ఏఎన్ఎం లు ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు నవచేతన యాప్‌పై శిక్షణ



**పలమనేరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు బాలికోన్నత పాఠశాలలో ఐసిడిఎస్, సిడిపిఓ ఉమా రాణి ఆధ్వర్యంలో నవచేతన ఏఐ స్క్రీనింగ్ యాప్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ నజ్మా సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె విలేకరులకు తెలిపిన వివరాల మేరకు.6 సంవత్సరాల చిన్నారుల సమగ్ర ఆధునిక సాంకేతికత లక్ష్యంగా నవ చేతన తో పాటు కృత్రిమ మేధస్సు ఏఐ ఆధారిత స్క్రీనింగ్ తదితర వాటిపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. చిన్నారుల్లో ప్రారంభం నుండి ఎదుగుదల మానసిక అభివృద్ధి,లోపాలును ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ద్వారా ముందస్తుగానే గుర్తించే విధానాలపై ఈ శిక్షణ తరగతుల్లో క్లుప్తంగా వివరించడం జరిగిందని తెలిపారు. ఐసిడిఎస్ సూపర్వైజర్లు మాధవి లత, నజ్మా, మాట్లాడుతూ.... చిన్నారుల భవిష్యత్తుకు మొదటి పునాదులు వేయడంలో కీలపాత్ర వహించాల్సింది అంగనవాడి కార్యకర్తలేనని, గుర్తు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు శ్రద్ధగా ఇక్కడ నేర్పించే పాఠాలను నేర్చుకొని అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు నేర్పించడం వలన వారిలో జ్ఞాపకశక్తి, పుష్కలంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఎంఈఓ 2 బాల సుందరం,యు పి ఎస్ సి కాకా తోపు మెడికల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పిల్లలకు తొలి గురువు, తొలి పాఠశాల అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడి కేంద్రమేనని పేర్కొన్నారు. అంగన్వాడీల మేదస్సును పెంపొందించే మంచి నైపుణ్యత కలిగిన నవ చేతన యాప్ ద్వారా పిల్లలకు జ్ఞానాన్ని కలిగించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు పాల్గొన్నారు.

## బజాజ్ ఫైనాన్స్ బ్రాంచ్ ప్రారంభోత్సవం



**పుంగనూరు, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ రోడ్డులో (రాజు కాంప్లెక్స్) నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ ఆర్థిక సంస్థ బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ గోల్డ్ లోన్ విభాగాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ పి. అయూబ్ ఖాన్ (చైర్మన్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం హెల్త్, ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్) రిబ్బన్ కట్ చేసి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ పి. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ.... పుంగనూరు పరిసర ప్రాంతాల ప్రజలకు, వ్యాపారులకు, ఖాతాదారులకు మరింత వేగవంతమైన పారదర్శకమైన ఆర్థిక సేవలు అందించడానికి ఈ నూతన శాఖ ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తక్కువ డాక్యుమెంటేషన్‌తో త్వరితగతిన గోల్డ్ లోన్ పొందే సదుపాయం స్థానికులకు ఎంతో మేలు చేకూరుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజు కాంప్లెక్స్ అధినేత రామకృష్ణంరాజు బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతినిధులు మిస్టర్ గౌస్ బాషా,హరి ప్రసాద్ , ఎ. మునికృష్ణ,సగిరాజు దిలీప్ రాజు,సంస్థ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

# యోగా ప్రజల నిత్యజీవితంలో భాగం కావాలి

**- మదనపల్లిలో ఘనంగా సామూహిక యోగా కార్యక్రమం - పాల్గొన్న వివిధ శాఖల అధికారులు,ప్రజలు**
**- ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా అత్యంత ప్రభావవంతమైన సాధనమని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ 12వ యోగా దినోత్సవం-2026 సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం మదనపల్లి ఆర్టీసీ డిపో-1 సమీపంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితర అధికారులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు,యోగా శిక్షకుల మార్గదర్శకత్వంలో యోగాసనాలు చేశారు. ఈ కార్యక్రమా నికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు,అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, యోగా అభ్యాసకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్ర-2026 ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం దిశగా జిల్లా ముందడుగు వేస్తోందన్నారు. యోగా పట్ల ప్రజల్లో పెరుగుతున్న చైతన్యం సంతోషకరమన్నారు. తెల్లవారుజా మునే పెద్దసంఖ్యలో ప్రజలు హాజరుకావడం యోగాపై వారి ఆసక్తి,అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాను ప్రజల జీవనశైలిలో భాగం చేయాలనే సంకల్పంతో యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత,భావోద్వేగ సమతుల్యత కూడా సాధ్యమవుతుం దన్నారు. జిల్లాకు కేటాయించిన ప్రత్యేక థీమ్‌కు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో జూన్ 11న హార్సిలీహిల్స్ మరియు 14న బోయకొండలో కూడా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యోగాను కేవలం యోగా దినోత్సవానికే పరిమితం చేయకుండా ప్రతిరోజూ ఆచరించే అలవాటు పెంపొందించుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత నిస్తోందన్నారు. అందుకే యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రజల దైనందిన జీవనశైలిలో భాగం చేసే దిశగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు చేపట్టిందన్నారు. నేటి పిల్లలే దేశ భవిష్యత్తుని,ఆరోగ్యవంతమైన తరం దేశ అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా యోగా శిక్షకుడు పాల్ బ్రహ్మకుమార్ పాల్గొన్న వారితో వివిధ యోగాసనాలు చేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి,ఐసీడీఎస్ పీడీ హైమావతి,డ్వామా పీడీ వెంకటరత్నం, డీపీఓ రాధమ్మ,డీఆర్డీఏ పీడీ నాగేశ్వరరావు,డీఎల్డీఓ లక్ష్మీపతి, డీఎంహెచ్‌వో లక్ష్మీనరసయ్య,మున్సిపల్ కమిషనర్ ప్రమీల,జిల్లా పర్యాటక అధికారి నాగభూషణం,తహసీల్దార్ మాధవి,వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఐసీడీఎస్ సిబ్బంది,విద్యార్థులు,యోగా అభ్యాసకులు,వివిధ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# యమునా పుష్కరాలలో ఉచిత అన్న ప్రసాద వితరణ

**- భక్తులకు రుచి, సుచి గలిగిన నాణ్యమైన భోజనం - బ్రాహ్మణ నిత్య అన్నదాన సమాజం ద్వారకా తిరుమల ఛైర్మన్ నారాయణ మూర్తి**
**- సహాయ సహకారం అందిస్తున్న ముని గోపాల కృష్ణ దంపతులు**



**మదనపల్లె, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉత్తరప్రదేశ్ లోని మధుర లో జరుగుతున్న యమునా పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం ఆంధ్ర ప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు,బ్రాహ్మణ నిత్య అన్నదాన సమాజం ద్వారకా తిరుమల ఛైర్మన్ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ నుండి నిపుణులైన వంట వారితో కలసి 40 మంది బృందంగా వెల్లి రుచి, సుచి కలిగిన నాణ్యమైన భోజనాన్ని అందిస్తున్నారు. ఈ మహా యజ్ఞంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్ ముని గోపాల కృష్ణ, రిటైర్డ్ డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఏపీ స్టేట్ ప్రివిలేజ్ కమిటీ లైఫ్ మెంబర్ ధనలక్ష్మిలు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తూ భాగస్వాము లయ్యారు. జూన్ రెండవ తేదీ న మొదలైన యమునా పుష్కరాలు 13వ తేదీ వరకు కొనసాగ నున్నాయని అప్పటి వరకు ఉచిత అన్నదాన కార్యక్రమం కొనసాగు తుందని నారాయణమూర్తి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యమునా పుష్క రాల్లో గడిచిన 6 రోజులుగా వేలాది మందికి అన్న ప్రసాదాన్ని ఉచితంగా అందజేయడం జరిగిందని తెలిపారు. 2008వ సంవత్సరం లో ఏర్పాటు చేసిన బ్రాహ్మణ నిత్య అన్నదాన సమాజం ద్వారా ఇప్పటివరకు 12 పుష్కరాలలో అన్న ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా అందజేయడం జరిగిందని వెల్ల డించారు. అంతే కాకుండా గడిచిన 10 సంవత్స రాలుగా ద్వారకా తిరుమలలో నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం కొనసాగు తోందని వివరించారు. పుష్కర సమయం లో 12 రోజులు పాటు నదీ తీరంలో జరిగే వేడుకలకు హాజ రయ్యే భక్తుల ఆకలి తీర్చడమే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఇందు లో భాగంగా ఇప్పటి వరకు కృష్ణ, కావేరి, ప్రాణహిత, గంగ, నర్మదా, సరస్వతి, గోదావరి, నది పుష్కరాల తో పాటు యమునా పుష్కరాల లోనూ తాము భాగ స్వాము లు కావడం జరి గిందని నారాయణ మూర్తి గుర్తు చేశారు. 12 రోజులు పాటు జరిగే ఈ పుష్కరాల లో ముక్కోటి దేవత లు యమునా పరిహాక పరివాహక ప్రాంతాలలో సంచరిస్తూ ఉంటా రని ఈ తీర్థయాత్ర ల లో భక్తులు పుణ్య స్నానాలు, ఆచరించి దైవ దర్శనం చేసు కోవడం వల్ల భగ వంతుడు ఆశీస్సులు, కృపా కటాక్షాలు లభిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. డాక్టర్ ఎన్ ముని గోపాలకృష్ణ మాట్లాడుతూ భక్తుల అన్నదాన సేవకే పునరంకిత మైన నారాయణమూర్తి చేస్తున్న సేవలో తాము భాగస్వాము లు కావడం పట్ల ఎంతో సంతోషంగా ఉందన్నారు. పుష్కర సమయంలో భక్తులకు అన్న ప్రసాదాన్ని అందిస్తూ ఆధ్యాత్మిక సేవలో తరించడం మానవ జీవితానికి మోక్ష మార్గమన్నారు. ఏపీ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ద్వారా భక్తులకు నాణ్యమైన రుచి కరమైన భోజనాన్ని అందించడం జరుగు తొందని తెలిపారు. ఈ పుష్కరాలకు దేశంలోని వివిధ రాష్ట్రాలతో పాటు విదేశాల నుంచి కూడా వచ్చిన భక్తులందరికీ రుచి కరమైన ఆహారాన్ని వారు ఆరగించి అన్నదాత సుఖీభవ అని దీవించడం జరిగిందని గుర్తు చేశారు. భోజనాలను పాటు వివిధ ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ నిత్య అన్నదాన సమాజం ట్రస్ట్ వైస్ ఛైర్మన్ వెంకట పురుషోత్తమరావు, కోశాధికారి లక్ష్మీ నారాయణ శాస్త్రి, ట్రస్టీలు వెంకట సుబ్రహ్మణ్యం, పెండ్యాల ఆత్మ రాం,జయంతి వర ప్రసాద్, దసిక రమేష్,సూర్య నారాయణ మూర్తి,మేనేజర్ వేంపరాల సుబ్బా లక్ష్మి దసిక లలిత, పాకశాస్త్ర నిపుణులు, స్వచ్ఛంద వాలంటీర్లు పాల్గొన్నారు.

## యోగ విన్యాసాలతో ఆకట్టుకున్న చైతన్య సంస్థ చిన్నారులు

**- ప్రశంస పత్రాలు అందజేసిన కలెక్టర్ నిశాంత్ కుమార్**



**మదనపల్లె,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహించిన యోగాంధ్ర-2026 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ,సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి,మునిసిపల్ కమీషనర్ ప్రమీల ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా యోగాంధ్ర కార్యక్ర మాన్ని మదనపల్లె జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు,యోగ విన్యాసాలతో చిన్నారులు అందరిని అలరించారు. ఇందులో భాగంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు మరియు సమయ పాలనా గురించి అవగాహన కలిగిన నృత్యాలు చేసి అందరిని అలరించారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చేతుల మీదుగా బహుమతిని అందుకుని అందరి ప్రశంసలను పొందారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులు ప్రతీ కార్యక్రమానికి హాజరై సంస్కృతిక కార్యక్రమాలు చేస్తున్న పిల్లలకు తర్ఫీదునిచ్చిన చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ.కవిత రాణిని కొనియాడారు. భవిష్యత్తులో ఈ చిన్నారులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు,చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ అక్రమాలపై విచారణ జరపాలి

**- కలెక్టర్‌కు వైకాపా విద్యార్థి విభాగం వినతి**

**మదనపల్లె, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా విద్యాశాఖ పరిధిలోని ఓపెన్ స్కూల్ సొసైటీలో గత కొంతకాలంగా తీవ్రమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ శ్రీనివాస రాజు చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడని, ఆయనపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సోమవారం పీజీఆర్ఎస్ నందు జిల్లా కలెక్టరుకి వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి హేమంత్ కుమార్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ డిప్యుటేషన్ కాలపరిమితి కేవలం మూడేళ్లు మాత్రమేనని, శ్రీనివాస రాజు కాలపరిమితి ఎప్పుడో ముగిసిపోయినా నిబంధనలను తుంగలో తొక్కి డెప్యుటేషన్ పేరుతో ఇంకా అదే పదవిలో అక్రమంగా కొనసాగుతున్నారన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ కేంద్రాల కేటాయింపుల్లోనూ అమాయక విద్యార్థుల నుంచి ఒక్కొక్కరి దగ్గర రూ.3 నుండి రూ.5 వేల వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయన్నారు. కనీసం పీసీపీ క్లాసులకు హాజరుకాని అభ్యర్థుల నుంచి పెద్దఎత్తున వసూలు చేసి వారు క్లాసులకు హాజరైనట్లు రికార్డుల్లో నకిలీ హాజరు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ఓపెన్ స్కూల్ విధానంలో కీలకమైన 20 శాతం అంతర్గత మార్కులు ఇచ్చే ప్రక్రియను ఒక పెద్ద వ్యాపారంగా మార్చారని, విద్యార్థుల నుండి ఖాళీ పేపర్లు సేకరించి, లంచాల డబ్బులు తీసుకుని ఆన్‌లైన్ పోర్టల్‌లో పూర్తి మార్కులు వేస్తూ అర్హులైన విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అదేవిధంగా బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికార హోదాలో ఉంటూ శ్రీనివాసరాజు వైఎస్సార్ కడప జిల్లాలోని హరిత హోటల్ నందు జరిగిన ఒక పూర్తి స్థాయి రాజకీయ సమావేశానికి హాజరయ్యారని, ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా ఉల్లంఘించి, రాజకీయ పార్టీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పత్రికా సమావేశం ఏర్పాటు చేయాలంటే పైఅధికారుల అనుమతి కావాలన్నా కనీస నిబంధనలు సైతం పక్కనపెట్టి, ఏకపక్షంగా సర్వీస్ నిబంధనలకు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ప్రభుత్వ జీతం తీసుకుంటూ పరిధి మరిచి రాజకీయాలు చేస్తూ, ఓపెన్ స్కూల్ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న కోఆర్డినేటర్ శ్రీనివాస రాజును వెంటనే విధులనుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన హయాంలో జరిగిన ఆర్థిక, విద్యా అక్రమాలపై కలెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేక విచారణ కమిటీని వేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షులు నరేష్,జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబెర్ పవన్‌రాయల్, ఖాదర్ వలి,విశ్వ,తేజ, ఉదయ్, పాల్గొన్నారు.

## రెవెన్యూ ఉద్యోగుల నిరసన

**- తహసీల్దార్‌కు వినతి**



**రామసముద్రం, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీఆర్వోల సంఘం పిలుపు మేరకు గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్ కు వినతిపత్రం సమర్పించారు. తీవ్ర పనిభారంతో ఆత్మహత్య చేసుకున్న వీఆర్వో మహమ్మద్ హుస్సేన్ మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్వో, వీఆర్ఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించడంతో పాటు ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంబంధం లేని శాఖల పనులను వీఆర్వోలకు అప్పగించడాన్ని నిలిపివేయాలని, రెవెన్యూ సిబ్బందిపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సమస్యలపై చర్చించి వీఆర్వోలు, వీఆర్ఏలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఖాళీ జాగాలపై కబ్జాదారుల కన్ను

**- పరిరక్షించాలంటూ స్థానిక ప్రజలు కలెక్టర్‌కు వినతి**

**మదనపల్లె, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ ఖాళి జాగాలపై కొందరు కబ్జాదారుల కన్ను పడుతోంది. ఓ కీలక ప్రజాప్రతినిధి పేరుతో భూ కబ్జాలకు తెగాయిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే మీవల్ల అయ్యేది చేసుకోండంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పట్టణంలోని కోళ్లబైలు గ్రామం వైఎస్సార్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఊరంతా కదిలి కలెక్టరేట్ పీజీఆర్ఎస్ కు వచ్చారు. సర్వేనెంబరు 669లో 2008 కాలనీ మంజూరు కాగా 15 సెంట్లు కమ్యూనిటీ పర్పస్ కోసం కేటాయించారు. రూ. కోటికి పైగా విలువ చేసే దీనిని కొట్టేయడానికి ఓ ప్రముఖ ప్రజాప్రతినిధి పేరుతో కబ్జాకు యత్నిస్తున్నారని కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ ను కలసి విన్నవించారు. ఈ స్థలం కబ్జా కాకుండా గుడి, బడి, అంగన్వాడీ, హాస్పిటల్ లేదా వాటర్ ట్యాంక్ లాంటి ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించాలని కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు. చేపట్టాలని సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



# అన్నమయ్య జిల్లా

## హార్సిలీ హిల్స్‌ను సందర్శించిన వి. రవిబాబు

**- మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి నాయకులు**



**మదనపల్లె/ బి. కొత్తకోట, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రముఖ పర్యాటక ప్రాంతమైన హార్సిలీ హిల్స్‌ను రాష్ట్ర సమాచార హక్కు చట్ట మాజీ కమిషనర్ వి. రవిబాబు సందర్శించారు. కాగా ఆయన్ను రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ ఛైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ చారిలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో మదనపల్లె నియోజకవర్గానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలపై అక్రమ పెట్టడం జరిగిందని, వాటి ఉపసంహారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించిన రవిబాబు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి చర్చించి, బాధిత కార్యకర్తలకు న్యాయం జరిగేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## స్పేషియల్ కంప్యూటింగ్ భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి పునాది

**- మిట్స్ యూనివర్సిటీలో అతిథి ఉపన్యాసం - హాజరైన ఏంజెల్ ఇన్వెస్టర్ డాక్టర్ మల్లేశం దాసరి**



**మదనపల్లె/ కురబలకోట,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డీమ్డ్ టు బి యూనివర్సిటీలోని ఇంటర్నేషనల్ రిలేషన్స్ సెల్ ఆధ్వర్యంలో వాస్తవ ప్రపంచంతో అనుసంధానమైన డిజిటల్ సాంకేతికతలు మరియు వాటి భవిష్యత్తు (స్పటిల్ కంప్యూటింగ్ అండ్ ది ఫ్యూచర్ ఆఫ్ స్పటిల్ ఇంటలిజెన్స్) అనే అంశంపై సోమవారం అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అమెరికాలోని బోస్టన్ నగరంలో ఉన్న నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీకి చెందిన స్పేషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ గ్రూప్ డైరెక్టర్,అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు ఏంజెల్ ఇన్వెస్టర్ డాక్టర్ మల్లేశం దాసరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఎ.ఆర్),వర్చువల్ రియాలిటీ (వి.ఆర్),స్పేషియల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,రియల్ టైమ్ 3డి కమ్యూనికేషన్ వంటి సాంకేతికతలు భవిష్యత్ ప్రపంచాన్ని రూపుదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. భౌతిక ప్రపంచం మరియు డిజిటల్ ప్రపంచం మధ్య వారధిగా పనిచేసే స్పేషియల్ కంప్యూటింగ్ సాంకేతికతల ప్రాముఖ్యతను వివరించారు. విద్య,ఆరోగ్య సంరక్షణ,గేమింగ్,ఇంజినీరింగ్,రియల్ ఎస్టేట్ మరియు వినోద రంగాల్లో ఎ.ఆర్,వి.ఆర్ సాంకేతికతల వినియోగం వేగంగా పెరుగుతోందని,వీటి ద్వారా వినూత్న అభ్యాస విధానాలు,మెరుగైన అనుభవాలు మరియు సమర్థవంతమైన సేవలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా స్మార్ట్ వేర్‌బుల్స్,సెన్సింగ్ టెక్నాలజీలు,డేటా కంప్రెషన్,డిస్ట్రిబ్యూటెడ్ కంప్యూటింగ్,రియల్ టైమ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో జరుగుతున్న ఆధునిక పరిశోధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా తాను అభివృద్ధి చేస్తున్న స్మార్ట్ గ్లాసెస్ సాంకేతికతకు సంబంధించిన పరిశోధనలను ప్రదర్శించగా,అవి అధ్యాపకులు మరియు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్పేషియల్ ఇంటెలిజెన్స్ వ్యవస్థల నిర్మాణంలో ఉన్న అవకాశాలు,సవాళ్లు మరియు భవిష్యత్ పరిశోధనా దిశలపై సమగ్రంగా వివరించిన డాక్టర్ మల్లేశం దాసరి,ఈ రంగాల అంతర్-విభాగ స్వభావం కారణంగా ఎ.ఆర్,వి.ఆర్ మరియు స్పేషియల్ కంప్యూటింగ్ నైపుణ్యాలు భవిష్యత్తులో విద్యార్థులకు విస్తృతమైన ఉపాధి అవకాశాలను అందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,అడ్వైజర్ (ఆర్ అండ్ డి) డాక్టర్ తులసీరామ్ నాయుడు,అసోసియేట్ డైరెక్టర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ యూ.విజయలక్ష్మి,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలను రంజింపజేసిన సాసవల చిన్నమ్మ కథ

**- మహిళలకు చీరలు పంపిణీ చేసిన పురుం సహదేవ**



**మదనపల్లె, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణం,కదిరి రోడ్డులోని భారతం మైదానం నందు జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించిన సాసవల చిన్నమ్మ కథ ప్రజలను రంజింపజేసింది. ఈ నాటకానికి రామారావు కాలనీ (3వార్డు)కు చెందిన చేనేత విభాగం నాయకులు పురుం సహదేవ ఆర్థిక సహకారం అందజేయడమే కాకుండా నాటకాన్ని తిలకించడానికి విచ్చేసిన మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహదేవ మాట్లాడుతూ రోజురోజుకి కళలు అంతరించిపోతున్నాయని కావున అందరూ కళలను ప్రోత్సహించి కళాకారులను ఆదరించాలన్నారు. సాసవల చిన్నమ్మ కథలో అన్ని పాత్రలను చక్కగా ప్రదర్శించారన్నారు. సాసవల చిన్నమ్మ కథ వింటే ఎంతో పుణ్యం లభిస్తుందని,ఈ నాటక ప్రదర్శనకు తనవంతు సహకారం అందించడం నా పూర్వజన్మ సుకృతమన్నారు. అనంతరం మహాభారతం నిర్వాహకులు కొరముట్ల వెంకటేష్ (బీజేపి) మాట్లాడుతూ ప్రతి ఏడాది నిర్వహించే మహాభారత యజ్ఞానికి పురం సహదేవ తనవంతు సహకారం అందిస్తున్నారని ప్రశంసించారు. అదేవిధంగా ధర్మరాజు పాత్ర ధరించి రక్తికట్టించారని కొనియాడారు. ఈ ఏడాది మహాభారత యజ్ఞం దిగ్విజయంగా నిర్వహించడం జరిగిందని,ఆదరించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం పురుం సహదేవను పూలమాల,శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుజాతమ్మ,గోపమ్మ,కొప్పల హరినాథ్,శంకర్ రెడ్డి,వెంకట నాగులు,యశోదమ్మ,మనోహర్, గురు ప్రసాద్,ఆదిమూర్తి,మునెప్ప కాలనీ విశ్వనాథ్,శీనా పాల్గొన్నారు.

## తయ్యుబ్ వెల్ఫేర్ సొసైటీకి నూతన కార్యవర్గం ఎన్నిక




**కడప ఎడ్యుకేషన్ , జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కడపలోని తయ్యబ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీకి నూతన కార్యవర్గ ఏర్పడిన తరు ణంలో సొసైటీని అన్ని విధాల అబి వృద్ధి పరిచి మైనార్టీలకు తమ వంతుగా సేవలు అందగలవని సొసైటీ నూతన కార్యవర్గ సభ్యు లు తెలిపారు. కడప నగర పరిధి లోని తయ్యబ్ ముస్లిం లెవ్ఫేర్ సొసైటీకి సంబంధించి జనరల్ బాడీ సమావేశం నిర్వమించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. గత పాలకవర్గ ఛైర్మన్ హయాంలో సొసైటీ ఎలాంటి అభివృద్ధికి నో చుకలేదన్నారు. గత 23 సంవ త్సరాలుగా ఛైర్మన్‌గా ఉన్న వ్యక్తి పట్టించుకోకపోవడంతో గత మూడేళ్లుగా తయ్యబ్ పాలిటె క్నిక్‌లో అడ్మిషన్లు సైతం నిర్వహించలేకపోయారన్నారు. ఈ కారణం గా ముస్లిం మైనార్టీలకు తీవ్ర నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రస్తుతమున్న సొసైటీ కార్యాలయ ప్రహారీ సైతం సొసైటీ కార్యదర్శి మహ మ్మద్ ఆజం చొరవతో నిర్మితమైం దని తెలిపారు. ఇలాంటి తరుణంలో జనరల్ బాడీ సమావే శానికి రావాలని కోరినా గత పాలకవర్గంలోని ఛైర్మన్‌తోపాటు కొందరు సభ్యులు హాజరు కాలేదన్నారు. ఈ తరుణంలో సొసైటీని అభివృద్ధి పరచాలన్న ఉద్దేశ్యంతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నా రు. ఈ నూతన సొసైటీ పాలకవ ర్గం రాబోయే కాలంలో ప్రణాళి కబద్ధంగా ముందుకు సాగుతూ ముస్లిం మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతుగా కృషి చేయగలదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తయ్యబ్ ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గ ప్రతినిధులు, సభ్యులు, నగర ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

## పెన్నా నదిలో విషాదం.. స్నానానికి వెళ్లి అత్త, అల్లుడు మునిగి మృతి



**విజయవాడ , జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వేపరాల గ్రామం సమీపంలోని పెన్నా నదిలో ఆదివారం విషాద ఘటన చోటుచేసుకుంది. స్నానానికి వెళ్లిన అత్త, అల్లుడు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల వివరాల ప్రకారం, తొర్రివేముల గ్రామానికి చెందిన కళ్యాణ్ కుమార్ (25), అతని అత్త వెంగమ్మ (45) కుటుంబ సభ్యులతో కలిసి నది వద్దకు వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి లోతును సరిగా అంచనా వేయలేక ఇద్దరూ ఒక్కసారిగా లోతైన ప్రాంతంలోకి వెళ్లి మునిగిపోయారు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే రక్షణ చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో కళ్యాణ్ కుమార్ మృతదేహాన్ని వెలికితీయగా, వెంగమ్మ కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ దుర్ఘటనతో తొర్రివేముల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చంద్రబాబు వెన్నుపోటుపై రౌండ్ టేబుల్ సమావేశం



**ఆచంట జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పోడూరు మండలం తూర్పుపాలెం వైసీపీ కార్యాలయంలో మాజీ మంత్రి రంగనాథరాజు అధ్యక్షతన సోమవారం 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ విధానాలపై రంగనాథరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండేళ్ల పాలనలో హామీలను నెరవేర్చకుండా, మహిళలను, విద్యార్థులను మోసం చేయడమే కాకుండా నిత్యవసర వస్తువుల ధరలు పెంచారని ఆయన దుయ్యబట్టారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు పాల్గొన్నారు.

## పావగడ మాజీ ఎమ్మెల్యేకు ఈర లక్కప్ప నివాళులు



**మడకశిర జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పావుగడ మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ ఇటీవల మరణించగా, సోమవారం పావగడలో ఆయన వైకుంఠ సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మడకశిర వైకాపా ఇన్చార్జ్ ఈర లక్కప్పతో పాటు పలువురు వైకాపా నాయకులు హాజరై వెంకటరమణకు నివాళులు అర్పించారు. అనంతరం, వారు ప్రస్తుత ఎమ్మెల్యే, వెంకటరమణ కుమారుడు వెంకటేష్ ను పరామర్శించారు.

## బాపట్ల నూతన పురపాలక కమిషనర్ గా హాసిని బాధ్యతలు స్వీకరణ



**బాపట్ల జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బాపట్ల పురపాలక సంఘ కమిషనర్ గా సోమవారం హాసిని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, ఆమె పురపాలక సంఘ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. బాపట్ల పురపాలక సంఘ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని, పట్టణ అభివృద్ధిలో గతంలో కన్నా పురోగతి సాధించాలని కలెక్టర్ హాసినికి సూచించారు. ఈ సంఘటన బాపట్ల పట్టణంలో జరిగింది.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ప్రజలు ఖండించాలి



**నిడదవోలు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వంట గ్యాస్ సిలిండర్ ధర రూ.29లు పెంచి ప్రజలకు బహుమతి ఇచ్చిందని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు విమర్శించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం నిడదవోలు మండలం సింగవరంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెంచినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నోరు మెదపడం లేదని రాంబాబు విమర్శించారు. భవిష్యత్తులో కూడా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచాలనే ప్రయత్నిస్తున్నట్లుగా ఉందని దీనిని ప్రజలు తీవ్రంగా ఖండించాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలన వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి యుద్ధాన్ని సాకుగా చూపి ప్రజలపై కక్ష తీర్చుకుంటూ దేశంలోని బడా కార్పోరేట్లకు లాభాలు చేకూరుస్తూ లొంగుబాటు ప్రదర్శిస్తుందన్నారు. ఈ నెల 9న జరిగే రాస్తారోకో కార్యమాలను జయప్రదం చెయ్యాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పభుత్వం దృష్టికి సమస్యలు.. త్వరలోనే అందుబాటులోకి కొత్త వ్యవస్థ: మంత్రి అనిత!



**విజయనగరం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టాదారు పాసుపుస్తకాల ద్వారా భూమిపై సంపూర్ణ, శాశ్వత హక్కులు కల్పించి భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. జిల్లాలోని ఎస్.కోట నియోజకవర్గం వేపాడ మండలం బల్లంకిలో సోమవారం ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను మంత్రి అనిత రైతులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వ పాలనలో రీ సర్వే తప్పుగా నిర్వహించి రైతులు, భూ హక్కుదారులను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. 70 శాతం తప్పులతో పాస్ పుస్తకాలు తయారు చేయడంతో రైతులు గందరగోళానికి గురయ్యారని అన్నారు. రైతుల భూ సమస్యలు పరిష్కరించేందుకే జిల్లాల్లో ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్‌లను కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులకు అందకపోతే చరవాణి ద్వారా నేరుగా ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లేందుకు త్వరలోనే ఓ నూతన వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి ప్రకటించారు. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తున్నామని వివరించారు.

## రామోజీరావు ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తి: మంత్రి డోలా



**టంగుటూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సామాజిక చైతన్యం కోసం పత్రిక రంగం ద్వారా రామోజీ రావు కృషి చేశారని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. టంగుటూరు మండలం తూర్పు నాయుడు పాలెంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సోమవారం రామోజీరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎంతో మందికి ఆదర్శంగా ఎదిగిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు. పత్రికలు అంటే వ్యాపారం కాదని, సామాజిక బాధ్యత అని భావించి... ఆచరించి చూపిన దార్శనికుడు అని అన్నారు. విలువలు, క్రమశిక్షణ, నిబద్ధత, ధైర్య సాహసాలతో నిలిచిన ఆయన ప్రస్థానం భావి తరాలకు స్ఫూర్తి అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జరుగుమల్లి మండల నాయకులు పోకూరి రవీంద్రబాబు, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో చోరీకి పాల్పడ్డ దొంగలు అరెస్టు



**అనకాపల్లి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చెడు వ్యసనాలకు బానిసలైన ఇద్దరు యువకులు ఆలయంలో చోరీ చేసి చివరికి పోలీసులకు చిక్కారు. ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపిన వివరాల ప్రకారం.. నక్కపల్లి మండలం రేవల్ల కొత్తూరు గ్రామానికి చెందిన కసిరెడ్డి శ్రీహరి, రేబాక గ్రామానికి చేసిన గంట్యాడ శ్రీను వెల్డింగ్ పని చేస్తుంటారు. చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు సరిపోక చోరీలు చేయాలని నిశ్చయించుకున్నారు. ఈ నెల 3న ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీకి యత్నించారు. విఫలమడంతో కొండ దిగువనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ పగలగొట్టారు. పక్కనే ఉన్న ఆండాలమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు, బంగారు, వెండి వస్తువులు అపహరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారురు. సోమవారం నిందితులిద్దర్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,38,078, 56 గ్రాముల బంగారం, 2 కేజీల 600 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.17,68,000 ఉంటుందని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు.

## వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి విశేష స్పందన



**మంగళగిరి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మంత్రి నారా లోకేశ్ ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా మంగళగిరి పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి విశేష ఆదరణ లభిస్తోంది. ఈ శిబిరంలో సోమవారం విద్యార్థులకు ప్రత్యేక ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. విద్యార్థులు మంగళగిరి హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి చేనేత చీరల తయారీ ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో స్థానిక పోలీస్‌స్టేషన్లను సందర్శించి ఆయా శాఖల పనితీరు, ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఫీల్డ్ విజిట్ ద్వారా విద్యార్థుల్లో విజ్ఞానంతోపాటు సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల ఆసక్తి పెంపొందుతాయని నిర్వాహకులు తెలిపారు.

## బిహార్‌లో బస్సు ప్రమాదం.. ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు



**నెల్లూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బిహార్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన పలువురు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. వివరాల్లోకి వెళ్తే.. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం ఆత్మకూరు నుంచి కొంతమంది యాత్రికులు వారణాసికి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. ఈ క్రమంలో బిహార్‌లోని ఔరంగబాద్‌కు 7 కిలోమీటర్ల దూరంలో వీరు ప్రయాణిస్తున్న బస్సు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందగా.. 15 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పందించారు. "ప్రమాద విషయం తెలియగానే దిల్లీ నుంచి జిల్లా అధికారులను అప్రమత్తం చేశాం. వెంటనే సహాయక చర్యలు చేపట్టాం. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 45 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. గాయపడిన వారిని గయా ఆసుపత్రికి తరలించారు. బిహార్ ప్రభుత్వం, అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సమన్వయంతో చర్యలు చేపట్టారు. క్షేమంగా ఉన్న వారిని వెనక్కి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం" అని మంత్రి తెలిపారు.

## ఎరువులు పంపిణీ చేసిన పల్లె రఘునాథ్ రెడ్డి



**పుట్టపర్తి జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రైతులకు వ్యవసాయ అవసరాలకు తగిన ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ గ్రామంలో రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

## గీత కులాల జీవనోపాధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక: జనతా వారధి వినతి



**భీమవరం జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరంలో సోమవారం, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలోని జనతా వారధి, గీత కులాల జీవనోపాధి పరిరక్షణకు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి బీఎస్ .శివనారాయణకు వినతిపత్రం అందించింది. గంగరాజు మాట్లాడుతూ నీరా ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ.వెంకటేశ్వర్లు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, కాగిత సురేంద్ర, వీరవల్లి ప్రసాద్, భూపతిరాజు సుబ్బరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు7 అర్జీలు నమోదు



**రేపల్లె జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రేపల్లె ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ, రేపల్లె, వేమూరు, భట్టిప్రోలు మండలాల నుండి ప్రజలు వివిధ సమస్యలపై ఏడు అర్జీలు అందించినట్లు తెలిపారు. ఈ అర్జీలను పరిశీలించి, సంబంధిత అధికారులకు పంపి సమస్యలను పరిష్కరిస్తానని ఆమె మీడియాకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎస్ సాయిప్రసాద్ ఆకస్మిక తనిఖీ

### : రెవెన్యూ క్లీనిక్‌ను పరిశీలించిన కలెక్టర్



**గుంటూరు జూన్08 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంటూరు జిల్లా కలెక్టర్‌ను సీఎస్ సాయిప్రసాద్ ఆకస్మికంగా సందర్శించి, రెవెన్యూ క్లీనిక్‌లో అర్జీలు సమర్పిస్తున్న విధానాన్ని, సిబ్బంది సేవల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలు అందిస్తున్నందుకు రెవెన్యూ క్లీనిక్ వ్యవస్థను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆర్థిక ప్రగల్భత, డీఆర్వో భాస్కర్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సుకుమార్ హ్యాపీ... రామ్ చరణూ హ్యాపీ



తన కెరీర్లో ఇంకే చిత్రానికీ పడనంత కష్టాన్ని 'పెద్ది' సినిమా కోసం పడ్డాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ఇందులో కుస్తీ యోధుడి పాత్ర కోసం చరణ్ తన దేహాన్ని ఎలా మార్చుకున్నాడో తెలిసిందే. తెరపై రెజ్లింగ్ సీన్లు చూసి అందరూ అవాక్కయిపోయారు. నిజంగా ఒక ప్రొఫెషనల్ రెజ్లర్‌ను చూస్తున్న భావనే కలిగింది ప్రేక్షకులు. తెలుగులో ఒక స్టార్ హీరో నుంచి ఇలాంటి ట్రాన్స్‌ఫర్మేషన్, పర్ఫెక్షన్ అరుదు. ఐతే దీని వెనుక చాలా కష్టమే ఉంది. ఒళ్లు హూనమయ్యేలా కష్టపడిన చరణ్.. తన చేతిని దెబ్బ తీసుకున్నాడు. 'పెద్ది' ప్రమోషన్లలో కుడి చేతికి అతను బ్రేస్‌తో కనిపించిన సంగతి తెలిసిందే. షూట్ పూర్తయ్యాక స్కాన్స్ తీస్తే ఏకంగా 7 టియర్స్ ఉన్నట్లు చరణ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ప్రమోషన్లకు ఇబ్బంది రావద్దని అతను సర్జరీ చేయించుకోలేదు. ఐతే ఈ సినిమా రిలీజైపోవడంతో చరణ్ అతి త్వరలో శస్త్రచికిత్స చేయించుకోబోతున్నాడు. సర్జరీ అయ్యాక మూడు నెలల పాటు విశ్రాంతి తీసుకోబోతున్నాడట మెగా పవర్ స్టార్. ఐతే 'పెద్ది' రిలీజవ్వగానే సుకుమార్ దర్శకత్వంలో కొత్త సినిమాను మొదలుపెట్టాలని అనుకున్నాడు కానీ.. ఇప్పుడు సర్జరీ వల్ల అది ఆలస్యం కాబోతోంది. చరణ్ వెంటనే అందుబాటులోకి రావట్లేదని సుకుమార్ ఏమీ ఫీల్ కావట్లేదని సమాచారం. మూడు నెలలు టైం కావాలని అడిగితే సంతోషంగా ఒప్పేసుకున్నాడట. కారణమేంటంటే.. చరణ్ సినిమాకు ఇంకా బౌండ్ స్క్రిప్టు రెడీ కాలేదు. 'పుష్ప-2' రిలీజై ఏడాదిన్నర కావస్తున్నా ఆయనకు టైం సరిపోలేదు. సుకుమార్ ఒక కథను ఓకే చేయడానికే చాలా టైం తీసుకుంటాడు. తర్వాత బౌండ్ స్క్రిప్టుకు కూడా చాలా టైం పడుతుంది. తన రైటింగ్ టీంతో కలిసి నెలల తరబడి కసరత్తు చేస్తాడు. చరణ్ సినిమాకు కథ ఓకే అయింది కానీ.. స్క్రీన్ ప్లే, డైలాగ్ వెర్షన్ రెడీ కాలేదు. ఇప్పుడు పని మొదలుపెడితే మూణ్నాలుగు నెలలు టైం పడుతుంది కాబట్టి చరణ్ టైం కావాలంటే హ్యాపీగా సరే అనేశాడు సుకుమార్. తనకు సుక్కు టైం ఇచ్చినందుకు చరణ్ కూడా హ్యాపీనే. ఈ సినిమా కోసం పని చేస్తున్న టీం వర్గాల సమాచారం ప్రకారం ఈ ఏడాది చివరికి గానీ ఈ సినిమా మొదలయ్యే అవకాశం లేదు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేయబోతున్నాయి. రాయలసీమ-ముంబయి బ్యాక్‌డ్రాప్‌లో ఈ కథ సాగుతుందని సమాచారం. ఇంతకుముందు సుకుమార్, చరణ్ కాంబినేషన్లో వచ్చిన 'రంగస్థలం' కల్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన నేపథ్యంలో ఈ చిత్రంపై ఉండే అంచనాలను అందుకోవడం అంత తేలిక కాదు.

## దసరా పండక్కు బాలయ్య -- వెంకీ క్లాష్ ?



సీనియర్ స్టార్ హీరోలు మరోసారి బాక్సాఫీస్ క్లాష్ కు రెడీ అయ్యేలా ఉన్నారు. వెంకటేష్, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొందుతున్న ఆదర్శ కుటుంబం షూటింగ్ చివరి దశకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఇదింకా పూర్తి కాకుండానే వెంకటేష్ ఈ నెలలో అనిల్ రావిపూడి సెట్స్ లో అడుగు పెట్టబోతున్నారు. అక్టోబర్ 2 అనుకున్నప్పటికీ ఫైనల్ గా దసరా సందర్భంగా అక్టోబర్ 16 ఆదర్శ కుటుంబం రిలీజ్ చేసేలా ప్లానింగ్ జరుగుతోందట. ట్విస్ట్ ఏంటంటే బాలకృష్ణ-గోపీచంద్ మలినేని కాంబోలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్ టైనర్ ని సైతం దసరాని టార్గెట్ చేసుకునే ఉద్దేశంతోనే చిత్రీకరణ వేగంగా జరుపుతున్నారట. బాలయ్య నాన్ స్టాప్ కోఆపరేషన్ వల్ల ఇది సాధ్యమయ్యేలా ఉందని యూనిట్ వర్గాలు అంటున్నాయి. గతంలో భగవంత్ కేసరి ఈ ఫెస్టివల్ కే వచ్చి సూపర్ హిట్ అందుకుంది. లియో, టైగర్ నాగేశ్వరరావు లాంటి టఫ్ పోటీని తట్టుకుని ఆ నెలలో విజేతగా నిలిచింది. కలెక్షన్లు అవార్డులు గెలుచుకుంది. చూస్తుంటే బాలకృష్ణ, వెంకటేష్ పరస్పరం బాక్సాఫీస్ వద్ద తలపడేలా ఉన్నారు. అయితే జూన్ 10 బాలయ్య పుట్టినరోజు సందర్భంగా వదలబోయే టీజర్ లో విడుదల తేదీని రివీల్ చేస్తారా లేదానేది ఆసక్తికరంగా మారింది. అక్టోబర్ 16 దాదాపు ఖాయమని యూనిట్ వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. ఇదే నిజమైతే మంచి మాస్ ప్లస్ క్లాస్ పోటీని థియేటర్లలో చూడొచ్చు. ఇప్పటికైతే రెండు నిర్మాణ సంస్థల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనలు రాలేదు. ఇక సినిమాల విషయానికి వస్తే ఆదర్శ కుటుంబం సక్సెస్ వెంకటేష్ కన్నా త్రివిక్రమ్ కే చాలా ముఖ్యం. ఎందుకంటే నెక్స్ట్ ప్లాన్ చేసుకున్న ప్యాన్ ఇండియా మూవీకి మార్కెట్ జరగాలంటే ఇది చాలా కీలకం. వీరసింహారెడ్డిని మించిపోయేలా మూవీ ఇస్తారని బాలయ్య ఫ్యాన్స్ ఆశలను టన్నుల లెక్కల్లో పెంచేసుకున్నారు. వెంకటేష్ ఫ్యాన్స్ సైతం తొలిసారి త్రివిక్రమ్ డైరెక్షన్ లో నటించడం పట్ల చాలా ఎగ్జైటింగ్ గా ఉన్నారు. ఈసారి ఫన్ తో పాటు క్రైమ్ కూడా ఉంటుందట

## తమన్ జేబులో ఎనిమిది సినిమాలు

ఈ మధ్య తమన్ సౌండ్ కొంచెం తగ్గిపోయింది. తన నుంచి సాలిడ్ బ్లాక్ బస్టర్ పడక అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే రాబోయే అయిదారు నెలల్లో తమన్ తుపాకీ నుంచి ఒకటి రెండు కాదు ఏకంగా అయిదు పవర్ ఫుల్ బుల్లెట్లు దిగబోతున్నాయి. తన ఓజి కన్సర్ట్ విశేషాలను పంచుకోవడానికి మీడియాను కలుసుకున్న ఈ మ్యూజిక్ సెన్సేషన్ తన రాబోయే ప్రాజెక్టుల గురించి ఇచ్చిన ఎలివేషన్స్ చూస్తే అంచనాలు పెరిగిపోయేలా ఉన్నాయి. అవేంటో చూద్దాం. మొదటిది బాలయ్య 111. వీరసింహారెడ్డి కాంబోని రీయట్ చేస్తూ దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ ఎంటర్ టైనర్ టీజర్ జూన్ 10 రానుంది. దసరాకి సినిమా విడుదల కావొచ్చని ఫిలిం నగర్ టాక్. ఇది ష్యూర్ షాట్ బ్లాక్ బస్టరని తమన్ హామీ ఇస్తున్నాడు. క్యాస్టింగ్ లో స్టార్స్ లేకపోయినా 'ఇట్లు అర్జున' కూడా అదే కోవలోకి చేరే నమ్మకాన్ని కలిగిస్తున్నాడు. వెంకటేష్ 'ఆదర్శ కుటుంబం' ఎన్ని రోజులు ఆడుతుందో చెప్పలేనంత గొప్ప ఫన్ తో వస్తోందని ఊరించాడు. వీటికన్నా ముందు విడుదలయ్యే 'లెనిన్' ఖచ్చితంగా అఖిల్ కెరీర్ బెస్ట్ అవుతుందనే కాన్ఫిడెన్స్ ని అక్కినేని ఫ్యాన్స్ కి ఇచ్చాడు. మెగాస్టార్ 158 గురించి చెబుతూ ఇది నెక్స్ట్ లెవెల్ అంటూ ప్రత్యేక ఎలివేషన్ ఇచ్చాడు. ఒక కమర్షియల్ సబ్జెక్టు దొరికితే చిరంజీవికి బెస్ట్ ఇస్తానని చెప్పిన తమన్ కు ఆ మాట నిలబెట్టుకునే టైం వచ్చింది. స్టేజి మీద చెప్పింది ఇవే అయినా తమన్ ఖాతాలో వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు, తమిళ మూవీ ఇదయం మురళి, సందీప్ కిషన్ సిగ్మా కూడా ఉన్నాయి. మొత్తానికి ఎనిమిది సినిమాలతో తమన్ పలకరింపు ఓ రేంజ్ లో ఉండబోతోంది. ఇంత బిజీగా ఉన్న సంగీత దర్శకుల్లో అనిరుద్ రవిచందర్, తమన్ నువ్వా నేనా అనే రేంజ్ లో పోటీ పడుతున్నారు.



దేవిశ్రీ ప్రసాద్ ఎంపిక లిమిటెడ్ గానే ఉంది. పైగా హీరో కూడా అయ్యాడు. రవి బస్రూర్ కౌంట్ పెద్దదే ఉంది కానీ డ్రాగన్ వచ్చే దాకా తన బెస్ట్ కోసం ఎదురు చూడాల్సిందే. ఇక తమన్ పైన చెప్పిన వాటిలో నాలుగైదు ఛార్ట్ బస్టర్స్ కొట్టినా చాలు తిరిగి టాప్ కు వచ్చినట్టే.




## దృశ్యం 3 ఎండింగ్.. మాస్టర్ ప్లాన్ ఉందా లేక కన్ఫ్యూజనా?



దృశ్యం 3 థియేటర్లలో 200 కోట్ల వసూళ్లతో బాక్సాఫీస్ దగ్గర సత్తా చాటింది. కానీ సినిమా చూసిన ప్రేక్షకుల బుర్రలో ఒకే ప్రశ్న తిరుగుతోంది. దర్శకుడు జీతూ జోసెఫ్ కథకు సరైన ముగింపు ఇవ్వకుండా సస్పెన్స్ తో ఎందుకు వదిలేశాడు అనేది ఇప్పుడు పెద్ద డిస్కషన్ గా మారింది. ఇది కావాలని ప్లాన్ చేసిన ఎత్తుగడా లేక కథను ఎలా ముగించాలో తెలియక చేసిన పనా అనే డిస్కషన్ మొదలైంది. జార్జ్ కుట్టీ ఫ్యామిలీ డ్రామాను ఇంకెంత కాలం సాగదీస్తారనే పెదవి విరుపులు కూడా నెట్టింట గట్టిగానే వినిపిస్తున్నాయి. ఒకే మర్డర్ కేసు చుట్టూ మూడు భాగాలు తీయడం మామూలు విషయం కాదు. ఫస్ట్ పార్ట్ మంచి ట్విస్ట్ తో ఆకట్టుకుంటే, రెండో భాగం ఎమోషన్స్ తో అంతకుమించి కనెక్ట్ అయింది. ఇక మూడో భాగానికి జనాలు థియేటర్లకు వెళ్లారంటే దానికి ప్రధాన కారణం జార్జ్ కుట్టీ క్యారెక్టర్ పై ఉన్న అభిమానమే. కానీ ఒకే కేసు చుట్టూ అవే ఎంక్వయిరీలు మళ్లీ మళ్లీ చూస్తుంటే ఆడియన్స్ కు విసుగు రావడం చాలా సహజం. ఆ క్యారెక్టర్ పై ఉన్న క్రేజ్ క్లిక్కయ్యిందా లేక జనాల్లో ఆసక్తి తగ్గిపోయిందా అనేది ముందు ముందు తేలనుంది. ఇక్కడే ఓపెన్ ఎండింగ్ లాజిక్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. హాలీవుడ్ లో ఇలాంటి ప్రయోగాలు కొత్త కాదు. ఇన్సెప్షన్ సినిమా క్లైమాక్స్ ను కావాలనే ఒక పజిల్‌లా వదిలేశారు. దానివల్ల ఆ ప్రాజెక్ట్ పై పదేళ్ల తర్వాత కూడా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. జీతూ జోసెఫ్ కూడా ఇదే ఫార్ములాను ఇక్కడ వాడినట్లు తెలుస్తోంది. సినిమాకు ఎండ్ కార్డు వేయకపోవడం వల్ల థియేటర్ల బయట కూడా ఆ కథ మీద జోరుగా చర్చలు నడుస్తున్నాయి. తర్వాత ఏమవుతుందనే ఈ క్యూరియాసిటీనే సినిమాకు ఫ్రీ పబ్లిసిటీ తెచ్చిపెడుతోంది. అయితే దీనికి ఇంకో నెగిటివ్ యాంగిల్ కూడా ఉంది. కథను లాజికల్ గా పూర్తి చేయలేకే దర్శకుడు మధ్యలో వదిలేశాడనే విమర్శలు వస్తున్నాయి. నాలుగో భాగం కోసం తన దగ్గర ప్రస్తుతం ఎలాంటి స్టోరీ లైన్ లేదని జీతూ గతంలోనే చెప్పాడు. అలాంటప్పుడు మూడో భాగంతోనే ఈ సిరీస్ కు ముగింపు ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్న లాజికల్ గానే అనిపిస్తుంది. ఒక వర్గం ఈ సస్పెన్స్ ను బాగా ఎంజాయ్ చేస్తుంటే, మరో వర్గం మాత్రం కథను గౌరవంగా ముగించేయాలని కోరుకుంటోంది.



# బిజినెస్ న్యూస్



## భారీ నష్టాల్లో సూచీలు: సెన్సెక్స్ 719, నిఫ్టీ 244 పాయింట్లు డౌన్



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకోవడం, చమురు ధరలు పెరగడం, అమెరికాలో వడ్డీ రేట్లు పెరుగుతాయన్న అంచనాలు ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్‌నూ పడేశాయి. సెన్సెక్స్ ఓ దశలో 800 పాయింట్ల నష్టపోగా.. మధ్యలో కోలుకున్నట్లు కనిపించింది. ఆఖరిలో మళ్లీ అమ్మకాల ఒత్తిడితో 700 పాయింట్ల నష్టపోయింది. సెన్సెక్స్ ఉదయం 73,421.61 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,243.34) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టల్లో కదలాడింది. ఇంట్రాడేలో 73,318.94 - 73,934.35 మధ్య చలించిన సూచీ.. చివరికి 719.08 పాయింట్ల నష్టంతో 73,524.26 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 243.70 పాయింట్ల నష్టంతో 23,123 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.70గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎటర్నల్, మహీంద్రా అండ్ మహీంద్రా, ట్రెంట్, ఇండిగో, రిలయన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, బీఈఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఎస్‌బీఐ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.95 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్సు 4290 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. కారణాలు ఇవీ.. పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ పరస్పర దాడులు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో ఆసియా మార్కెట్లు దాదాపు నష్టాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లూ నష్టాల్లో ట్రేడవుతున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో మరోసారి ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. 93 డాలర్ల వద్ద ట్రేడవుతున్న క్రూడాయిల్ 96 డాలర్ల స్థాయికి చేరడం మన మార్కెట్‌లో సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

## త్వరలోనే రూ.10,000 కోట్ల జెప్టో ఐపీఓ!




క్విక్ కామర్స్ సంస్థ జెప్టో సవరించిన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ఈ వారంలోనే సమర్పించే అవకాశం ఉందని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు తెలిపాయి. ఆదిత్ పలీచా నేతృత్వంలోని ఈ కంపెనీ పత్రాలు సమర్పించిన తర్వాత ఇన్వెస్టర్ రోడ్‌షోలను కూడా నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకుంటోంది. ఈ నెలాఖరున లేదంటే జులైలో ఐపీఓ ఉండొచ్చని సమాచారం. ఈ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.10,000 కోట్లకు పైగా నిధులు సమీకరించాలని జెప్టో భావిస్తోంది. ఈ సంస్థ త్రైమాసిక నికర ఆర్డరు విలువ (ఎన్‌ఓవీ) 1 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9,500 కోట్ల)ను అధిగమించింది. 2021లో ఆదిత్ పలీచా, కైవల్య వోహ్రా జెప్టోను స్థాపించారు. దేశంలో అతి పెద్ద క్విక్ కామర్స్ కంపెనీల్లో ఒకటిగా అత్యంత వేగంగా ఎదిగింది. తొలుత గత డిసెంబరులో కాన్ఫిడెన్షియల్ పద్ధతిలో ఐపీఓ ముసాయిదా పత్రాలను కంపెనీ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా సెబీ అడిగిన మరిన్ని అంశాలు జోడించి పత్రాలు సమర్పించబోతోంది.

## 'టెక్ స్టాక్స్ అమ్మకాల్లో ఉంటే కొనుక్కోండి..

### ఇదే మంచి సమయం': హువాంగ్



కృత్రిమ మేధ రంగంలో ప్రస్తుత షేర్ల పతనం వాస్తవానికి మంచి వార్తేనని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ అంటున్నారు ). ఏఐ నిర్మాణం ఇప్పుడే మొదలైందని, టెక్‌స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిలో ఉన్నప్పుడే కొనుగోలుకు మంచి సమయం అని వ్యాఖ్యానించారు. ఎన్విడియా సహా పలు చిప్ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూస్తోన్న సమయంలో హువాంగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. కృత్రిమమేధ (ఏఐ) సంస్థల విలువలపై మదుపర్లకు సందేహాలు ఏర్పడటం, యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను పెంచొచ్చన్న ఆందోళనలు ఈ నష్టాలకు దారితీశాయి. ఏఐ పెట్టుబడులను మదుపర్లు భారీగా వెనక్కి తీసుకోవడంతో దక్షిణకొరియా సూచీ కొస్పి పతనమైంది. ఈ షేర్ల అమ్మకాలను ఎలా చూడాలంటూ ఆ దేశంలోనే ఉన్న హువాంగ్‌కు ప్రశ్న ఎదురైంది. "కృత్రిమ మేధ మొదలైంది ఇప్పుడే. ఇప్పుడు మీరు డిస్కౌంట్‌లో స్టాక్స్ కొనుగోలు చేయడానికి మంచి సమయం. ఉత్సాహంగా ఉండాలి. ఇంటర్నెట్ ఎలాగైతే ఇప్పుడు ప్రజల జీవితాల్లో అత్యంత కీలకంగా ఉందో.. ఏఐ కూడా అలాగే మారడం ఖాయం" అని అభిప్రాయం వ్యక్తంచేశారు. ఏఐ పలు రంగాల్లోకి విస్తృత మార్పులు తీసుకువస్తుందని, ప్రజల జీవన విధానాన్ని మారుస్తుందని హువాంగ్ విశ్వసిస్తున్నారు. ఆ ఏఐ సర్వీసుల్ని అందించాలంటే డేటా సెంటర్లు, చిప్స్ కీలకం. ప్రస్తుత కృత్రిమ మేధ యుగంలో డేటా సెంటర్లకు అత్యాధునిక చిప్‌లను అందిస్తూ ఎన్విడియా ప్రపంచంలోనే అగ్రగామి సంస్థగా కొనసాగుతోంది.

## HDFC బ్యాంక్ అలర్ట్: EMI కస్టమర్లకు షాక్!




దేశంలోని అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకుల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (ఎణఖీజ దీఃఅని) తన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (వీజూ=)ను పలు కాలపరిమితులపై 5 నుంచి 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. కొత్త రేట్లు జూన్ 8, 2026 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారిత గృహ, వ్యక్తిగత, వాహన రుణాలు తీసుకున్న కొందరు కస్టమర్లకు భవిష్యత్తులో ఈఎంఐలు పెరిగే అవకాశం ఉంది.

ఆర్బీఐ రెపో రేటు స్థిరంగానే.. అయినా పెంపు ఎందుకు?

గత వారం జరిగిన ద్రవ్య విధాన సమీక్షలో ఆర్బీఐ రెపో రేటును 5.25 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది. అయితే బ్యాంకుల నిధుల సమీకరణ వ్యయం, డిపాజిట్ ఖర్చులు, మార్కెట్ పరిస్థితులు వంటి అంశాల ఆధారంగా ఎంసీఎల్ఆర్‌ను బ్యాంకులు స్వతంత్రంగా నిర్ణయిస్తాయి. అందుకే రెపో రేటులో మార్పు లేకపోయినా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన అంతర్గత బెంచ్‌మార్క్ రేట్లను సవరించింది.

ఏయే కాలపరిమితుల్లో ఎంత పెరిగింది?

సవరించిన ఎంసీఎల్ఆర్ రేట్ల ప్రకారం ఓవర్‌నైట్ రేటు 8.05 శాతం నుంచి 8.10 శాతానికి పెరిగింది. మూడు నెలల ఎంసీఎల్ఆర్ 8.15 శాతం నుంచి 8.20 శాతానికి, ఆరు నెలల ఎంసీఎల్ఆర్ 8.30 శాతం నుంచి 8.35 శాతానికి చేరింది.

రిటైల్ రుణాలకు కీలక బెంచ్‌మార్క్‌గా భావించే ఒక సంవత్సరం ఎంసీఎల్ఆర్ 8.35 శాతం నుంచి 8.40 శాతానికి పెరిగింది. రెండేళ్ల ఎంసీఎల్ఆర్‌లో అత్యధికంగా 10 బేసిస్ పాయింట్ల పెంపు చోటుచేసుకుని 8.45 శాతం నుంచి 8.55 శాతానికి చేరగా, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ 8.60 శాతం నుంచి 8.65 శాతానికి పెరిగింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ మాత్రం 8.05 శాతం వద్ద యథాతథంగా కొనసాగింది.

తాజా ఎంసీఎల్ఆర్ రేట్లు

ఓవర్‌నైట్ -- 8.10%
1 నెల -- 8.05%
3 నెలలు -- 8.20%
6 నెలలు -- 8.35%
1 సంవత్సరం -- 8.40%
2 సంవత్సరాలు -- 8.55%
3 సంవత్సరాలు -- 8.65%

ఈఎంఐలు వెంటనే పెరుగుతాయా?

అలా ఏం లేదు. ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానమైన రుణాల్లో వడ్డీ రేటు ప్రతి నెల, త్రైమాసికం లేదా వార్షిక రీసెట్ తేదీకి అనుగుణంగా మారుతుంది. కాబట్టి మీ రుణ ఖాతాకు తదుపరి రీసెట్ తేదీ వచ్చినప్పుడు మాత్రమే కొత్త ఎంసీఎల్ఆర్ ప్రభావం కనిపిస్తుంది. ఈఎంఐ పెరగవచ్చు లేదా రుణ కాలపరిమితి పొడిగించవచ్చు. ఇది రుణ ఒప్పంద నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

అసలేమిటీ ఎంసీఎల్ఆర్?

ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్) అనేది బ్యాంకు రుణాలను ఇవ్వగల కనీస వడ్డీ రేటు. 2016లో ఆర్బీఐ ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. బ్యాంకు నిధుల వ్యయం, నిర్వహణ ఖర్చులు, నగదు నిల్వల వ్యయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని దీనిని నిర్ణయిస్తారు. అనేక పాత గృహ, వ్యక్తిగత, వాహన రుణాలు ఇప్పటికీ ఎంసీఎల్ఆర్ ఆధారంగానే కొనసాగుతున్నాయి. బేస్ రేట్, బీపీఎల్ఆర్ యథాతథం

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బేస్ రేట్ ప్రస్తుతం 8.80 శాతంగా కొనసాగుతోంది. అలాగే బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్ ( 17.30 శాతంగా ఉంది. ఈ రేట్లు డిసెంబర్ 26, 2025 నుంచి అమల్లో ఉన్నాయి.

రుణగ్రహీతలు ఏం చేయాలి?

మీ హోమ్ లోన్ లేదా ఇతర రుణం ఎంసీఎల్ఆర్ ఆధారితమా, లేక జుదీూ=/రెపో-లింక్డ్ విధానంలో ఉందా అనేది ఒకసారి చెక్ చేసుకోవడం మంచిది.

## కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే ప్రజా సంక్షేమ సభను విజయవంతం చేయండి

**- శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం ఛైర్మన్ కొట్టే సాయి**



**శ్రీకాళహస్తి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెండు సంవత్సరాలు కూటమి ప్రభుత్వ పాలన పూర్తయిన సందర్భంగా 9న జరిగే తిరుపతిలోని దామినేడులో జరిగే ప్రజా సంక్షేమ సభను విజయవంతం చేయాలని దేవస్థానం ఛైర్మన్ కొట్టేసాయి పిలుపునిచ్చారు. సోమవారం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల కాలంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు, అదేవిధంగా పేదలకు ప్రతిష్టాత్మకంగా అందజేసే పింఛన్లకు దాదాపు 300 కోట్లు అవుతుంది, అదేవిధంగా ఉప ముఖ్యమంత్రి నిర్వహించే పంచాయతీరాజ్ శాఖ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని, సుమారు 5 అవార్డ్స్ గెలుచుకుందని తెలిపారు. అటవీ శాఖలో కూడా సమూల మార్పులు తెచ్చి పర్యావరణ దినోత్సవం సందర్భంగా సుమారు 2.5 కోట్లు సీడ్ బాల్స్ ను ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అందజేశారు. మహిళలకు ఉచిత బస్సు, వంట గ్యాస్, రైతులకు అన్నదాత సుఖీభవ సంక్షేమ పథకాలు సక్రమంగా అందజేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని, వైసీపీ ప్రభుత్వం హయాంలో పేద ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులు పడ్డారని, కానీ కూటమి ప్రభుత్వం పాలనలో ప్రజలు ఆనందంగా గడుపుతున్నారని తెలియజేశారు. అదేవిధంగా హైదరాబాదులో జరిగే అభివృద్ధి కన్నా అమరావతిలో జరిగే అభివృద్ధి వేగంగా జరుగుతుందని , భవిష్యత్తులో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి చంద్ర,జయ ప్రకాష్, కుమార్, రేణిగుంట మండల అధ్యక్షులు మిథున్ షా అలీ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## టీటీడీకి రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** హైదరాబాద్ కు చెందిన సాఫ్ట్వేర్ ఇంజనీర్ భూరం తిరుమల దీక్షిత్ అనే భక్తుడు సోమవారం టీటీడీ శ్రీ ఎస్వీ అన్నదానం ట్రస్టు కు రూ.10 లక్షలు విరాళంగా అందించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కి హైదరాబాద్ లోని కార్యాలయంలో విరాళం డీడీని దాత అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత తండ్రి రిటైర్డ్ ఇంజినీర్ బి. జగదీశ్వర్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతున్నాం

**-ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**



**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తు న్నామని ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొ రేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి' కార్యక్రమానికి 60 వినతులు అందినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా పలువురు వినియోగదారులు విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేసిన 'డయల్ యువర్ సిఎండి' కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యల్ని త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఏపీఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్ అంధ్ హెచ్ఆర్ డి) కే. గురవయ్య, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్ఏసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్. శోభా వాలెంటీనా, ఎం. ఉమాపతి, సిహెచ్ రామచంద్ర రావు, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు సురేంద్ర రావు, చక్రపాణి, జగదీష్, లత, తదితరులు పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 31 వినతులు

**-ఇంచార్జి కమిషనర్ శారదా దేవి**



**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 31 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంకు నేరుగా వచ్చి 21 మంది వినతులు సమర్పించగా,10 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. రాయల్ నగర్ లోని తమ ఇంటి వద్ద ఉన్న చెట్టు వలన ఇబ్బంది గా ఉందని సమస్య పరిష్కరిష్కరించాలని, వరదరాజ నగర్ లోని విశ్వం స్కూల్ రోడ్డు సగం నిర్మాణం చేసి ఆపారు పూర్తి చేయాలని, సంజయ్ గాంధీ కాలనీ లో స్థలం ఆక్రమించి కాంటీన్, కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, జూ పార్క్ రోడ్డు లో తొలగించిన తోపుడు బండ్లు ఇప్పించాలని, టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని, లక్ష్మీపురం కూడలి వద్ద రోడ్డు సమస్య పరిష్కరించాలని, రైతు బజార్, సుందరయ్య నగర్ దోభి కాలనీ, మధురనగర్ అక్కగార్ల గుడి వద్ద భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సెక్రటరీ శ్రీవిద్య, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు ఉన్నారు.

## న్యూ మారుతి నగర్‌లో స్విమ్స్ క్యాన్సర్ స్క్రీనింగ్



**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో సోమవారం తిరుపతి ఎం.ఆర్. పల్లి అర్బన్ పిహెచ్సీ పరిధిలోని న్యూ మారుతి నగర్ లో పింక్ బస్ ద్వారా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ముందస్తు నివారణ చర్యలపై డాక్టర్లు చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు.. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్/ వైస్ చాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్ ఆదేశాల మేరకు కమ్యూనిటి మెడిసిన్ ప్రొఫెసర్ మరియు పింక్ బస్ ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ అంజు డి ఆదె మార్గదర్శకత్వంలో నోడల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శివసంతోష్ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.పల్లి అర్బన్ పిహెచ్సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశులు, పింక్ బస్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, డాక్టర్ లావణ్య, ఏఎన్ఎంలు యాస్మిన్, సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారుల ఉపాధిపై దాడులు ఆపాలి

**: మున్సిపల్ కార్యాలయం వద్ద సిపిఎం ధర్నా**



**తిరుపతి సిటీ,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగరంలోని స్విమ్స్ సర్కిల్ వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ పరిసర ప్రాంతంలో దాదాపు రెండు దశాబ్దాలుగా తోపుడుబండ్లపై టిఫిన్లు, భోజనాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారస్తులను తొలగించే ప్రయత్నాలను నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలు నిర్వహిస్తోందని అన్నారు. అయితే పేదలు, కార్మికులు, చిరు వ్యాపారులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న సమయంలో ప్రభుత్వం ఏ విజయాన్ని సాధించిందో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించకపోయినా, ఉద్యోగాలు ఇవ్వకపోయినా పేదలు అప్పులు చేసి, ఫైనాన్స్‌ల ద్వారా డబ్బులు సమకూర్చుకుని తోపుడుబండ్లు కొనుగోలు చేసి స్వయం ఉపాధితో జీవిస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై అధికార యంత్రాంగం ప్రతాపం చూపడం తగదన్నారు. ముందుగా చిరు వ్యాపారుల సమస్యలను పరిష్కరించి, వారికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల అలిపిరి జూ పార్కు రోడ్డులో చిరు వ్యాపారుల బండ్లను జేసీబీలు, ట్రాక్టర్లతో ధ్వంసం చేయడం, వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేయడం తీవ్రంగా ఖండనీయమన్నారు. వారికి అండగా నిలిచిన సిఐటియు నాయకులపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. ఆ ఘటన జరిగిన కొద్ది రోజులకే స్విమ్స్ సర్కిల్ ప్రాంతంలోని వ్యాపారులను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. 2014 చట్టాన్ని అమలు చేయాలి తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం--సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి. బుజ్జి మాట్లాడుతూ, తిరుపతికి కొత్తగా వచ్చే ప్రతి మున్సిపల్ కమిషనర్ తోపుడుబండ్ల వ్యాపారులపైనే దృష్టి సారించడం బాధాకరమన్నారు. నగరంలోని ఇతర సమస్యలను విస్మరించి పేద వ్యాపారులను మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం అన్యాయ మన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్, నాయకులు పి. రమేష్, జి. వాసు, తోపుడుబండ్ల వ్యాపారస్తుల సంఘం నాయకులు ఈశ్వర్, మురళి, సురేష్, మణిమాల, విజయ్, శ్రీనివాసులు, వెన్నెల, సోఫా, మంజుల, సూరి, వినోద్, విశ్వరాజు, గోవిందు, కుమార్, భాష తదితరులు పాల్గొన్నారు.

## దానామూర్తిపల్లిలో రామోజీరావు 2వ వర్ధంతి

**చంద్రగిరి,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు జాతి గర్వించదగ్గ పత్రిక దిగ్గజం మీడియా యుగవకర్త పద్మభూషణ్ రామోజీరావు గారి 2వ వర్ధంతి ని దానా మూర్తి పల్లి లో పకృతి రైతు దామోదర్ నాయుడు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ అక్షర యోధునికి ఘన నివాళులు. పత్రికా రంగం అంటే వ్యాపారం కాదు సామాజిక బాధ్యత అని నిరూపించిన ఆదర్శవాదిఅన్నారు. సామాన్య కుటుంబం నుంచి అ సామాన్య శిఖరాలను అధిరోహించి, విలువలు, నిబద్ధతతో ఆయన సాగించిన ప్రస్థానం తరతరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. తెలుగు ప్రజల హృదయాలు ఆయన స్థానం శాశ్వతం అని కొనియాడారు.



## విజయోత్సవ సభకు జన సైనికులు పెద్ద ఎత్తున తరలి రావాలి

**-ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎన్నికల హామీల్లో మెజార్టీ హామీల్ని నెరవేర్చిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కి సమ ప్రాధాన్యత సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు ఇస్తున్నారని ఆయన చెప్పారు. తన కార్యాలయంలో మంగళవారం తిరుపతి లో జరిగే రెండేళ్ల విజయోత్సవ సభ సక్సెస్ పై జనసేన ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొట్టే సాయి లతో సోమవారం సమావేశం నిర్వహించారు. విజయోత్సవ సభ విజయవంతానికి ప్రతి డివిజన్ నుంచి జన సైనికులను తరలించాలని నాయకులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. సభ సక్సెస్ లో జనసేన కీలకంగా వ్యవహరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు స్వాగతం, వీడ్కోలు ఘనంగా పలికేందుకు పార్టీ శ్రేణులు పెద్దఎత్తున సభా ప్రాంగణానికి తరలి రావాలవని ఆయన కోరారు. అనంతరం మీడియాతో ఆరణి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు తోపాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ , యువ నాయకులు లోకేష్ తో పాటు రాయలసీమలోని ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులంతా సభకు హాజరౌతారని తెలిపారు. ఉమ్మడి మ్యానిఫెస్టో లో ప్రకటించిన సూపర్ సిక్స్ ను పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వానిదన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పు రాష్ట్రంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మోపి వెళ్లిందని ఆయన విమర్శించారు. ఉపాధి కల్పనలో భాగంగా 16, 346 మందితో మెగా డీఎస్సీ నిర్వహించి పారదర్శకంగా టీచర్ పోస్టులు భర్తీ ప్రభుత్వం చేసిందన్నారు. అలాగే బడి ఈడు పిల్లలందరికీ చదువు నేర్పించాలనే లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంతందికి ఏడాదికి 15వేలు అందిస్తున్నామని తెలిపారు. దీపం పథకం 2.0 కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదని ఆయన వివరించారు. రైతులకు అన్నదాత సుఖీభవ కింద సంవత్సరానికి 20వేలు అందిస్తున్నదని ఆయన తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించి 4,500 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులకు ఆమోదముద్ర వేయించి గిన్నీస్ వరల్డ్ రికార్డ్ సాధించారని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద మినీ గోకులాల నిర్మాణం, ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు పచ్చదనం పెంపునకు పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసిందని ఆయన చెప్పారు. అలాగే రాష్ట్రానికి జీవనాడైన పోలవరాన్ని ప్రభుత్వం పరుగులు పెట్టిస్తున్నదని ఆయన తెలిపారు. రాష్ట్ర పునర్ విభజన చట్టంలో పొందుపరిచిన రైల్వే ప్రత్యేక డివిజన్ ను సాధించిన ఘనత ఎన్డీఏ కూటమి ప్రభుత్వంకే దక్కిందన్నారు. మంగళవారం జరిగే విజయోత్సవ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలనలో దేశాభివృద్ధికి అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన క్లస్టర్ ఇన్చార్జులు, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## బహిరంగ సభ ఏర్పాట్లు పరిశీలించిన మంత్రులు



**తిరుపతి సిటీ,జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రి ప్రహల్లాద జోషి, మంత్రి నారా లోకేష్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ తదితర ప్రముఖులు పాల్గొననున్న దామినేడు సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు సోమవారం రాత్రి పరిశీలించారు. సభా స్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ , విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తదితరులకు పలు సూచనలు సలహాలు చేశారు.

## కూడళ్ళు, డివైడర్లను పరిశుభ్రంగా ఉంచండి

**-కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి**

**తిరుపతి, జూన్ 8 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని ప్రధాన కూడళ్ళు, డివైడర్ల వద్ద చెత్తచెదారం తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా సోమవారం ఉదయం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, గాంధీ విగ్రహం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ప్రధాన కూడళ్ళు, డివైడర్ల మధ్య పిచ్చి మొక్కలు, చెత్తచెదారం ఎక్కువగా ఉందన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రంగా ఉంచాలని తెలిపారు. అలాగే ఎండిపోయిన మొక్కలను తొలగించి, ఖాళీగా ఉన్న ప్రాంతాల్లో కొత్త మొక్కలు నాటి సంరక్షించాలని ఉద్యానవన శాఖ అధికారికి సూచించారు. రోడ్లపైన ఉన్న చెత్త ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, కాలువల్లో చెత్త తొలగించాలని సూచించారు. ప్రకాశం పార్కు వెనుక వేస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమం లో శానిటరీ సూపర్ వైజర్ సుమతి, పారిశుధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.



Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027